UNIVERSAL LIBRARY
OU_204488
UNIVERSAL LIBRARY

# ప్రత్యూష

(పద్య సంకలనము)

✱

వివిధ రచయితలు

✱

సాధన సమితి
హైదరాబాదు,

స్థాపితము: ౧౯౩౯

# మా మనవి

"సాధన సమితి"కి పది సంవత్సరాలు నిండినవి. ఈ రెండవ దశకంతో మా 'సాధన' కూడ క్రొత్త బాటలవైపు అడుగిడ ప్రత్యూష[illegible]డుతున్నది.

ఇంతవరకు, సమితి సభ్యులైన యువరచయితల రచనలనే మా 'ప్రత్యూష ప్రచురణాల' ద్వారా ఆంధ్రలోకానికి అందజేస్తూ వచ్చాము; కాని యిప్పుడు సభ్యేతరుల్లోని ప్రఖ్యాత రచయితలను కూడా మాతో సహా ఒక్కుమ్మడిగా సాహిత్యారాధకులకు పరిచయం చేయించాలనే సంకల్పం కలిగింది. ఈ ఉద్దేశ్యాన్ని నెరవేర్చటందుకు చేసిన తొలి ప్రయత్న ఫలితమే 'ప్రత్యూష'.

ఈ కావ్య సంకలనంలో, ప్రధానంగా, తెలంగాణంలోని సుప్రసిద్ధులైన కవుల, కవయిత్రుల ఉత్తమోత్తమ కావ్యసుమాలను ఏరి కూర్చే ప్రయత్నం జరిగింది. కాని, మానవ ప్రయత్నంలోని సహజమగు లోటు పాట్లవలన ప్రసిద్ధులైన కొందరు కవులు ఈ సంపుటిలో చేరక పోయి ఉండవచ్చును; లేదా సేకరించిన కృతులు, ఆయా కవుల ఉత్తమోత్తమ రచనలు కాక పోనూ వచ్చును. ఇంతమాత్రంచే సహృదయులైన కవికుమారులు మాపై కినుక వహించక, మమ్మల్ని క్షమించ గలరని ప్రార్థన.

నేడు హైదరాబాదు రాష్ట్రంలో బహుముఖాలుగా విజృంభిస్తున్న ఆంధ్రోద్యమానికి పితామహులైన శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులు గారి పీఠిక మా 'ప్రత్యూష'కు ఒక అపూర్వాలంకారంగాను శుభాశీస్సుగానూ ఉపకరిస్తున్నది. శ్రీ వారికి మా కృతజ్ఞతా పురస్సర మోవాకోలు.

ఆర్థికంగా మాశక్తికి అతీతమైన ఈ ప్రయత్నంలో మాకు చేయూత నిచ్చిన అభిమానులకందరికీ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు అర్పిస్తున్నాము. ముందు కూడా మా ప్రయత్నాలను వారు ఇదే విధంగా ప్రోత్సహించగలరని ఆశిస్తున్నాము.

15 ఫిబ్రవరి 1950
[illegible]మియా బజారు

ఇట్లు
కార్యదర్శి,
సాధన సమితి

# పీఠిక

సాధనసమితివారిచే ప్రకటింపబడుచున్న "ప్రత్యూష" కు పీఠిక వ్రాయు అవకాశమును, గౌరవమును, నాకు లభించి నందులకు నేనెంతయు సంతసించుచు, సమితి కార్యకర్తలకు కృతజ్ఞత తెలుపుచున్నాను.

సాధనసమితియను పేరున ఈ సంస్థ ౧౯౩౯ లో స్థాపితమైనది. ఆరంభమునుండియు ఆంధ్రసారస్వతసేవ ముఖ్యోద్దేశముగాగల ఈ సంస్థపక్షమున, "ప్రత్యూష" పేరుతో నొక లిఖితమాసపత్రికను నాలుగైదు వత్సరములవరకు నడిపింపబడినది. ఇప్పటివరకు సమితివలన ౧౭ పుస్తకముల ప్రకటింపబడినవి. వీనిలో కొన్ని, కొందరు గ్రంథకర్తల రచనలను ఏకత్రముగా ప్రచురింపబడినవి. మరికొన్ని విడివిడిగానున్న రచయితలవి. ఈ రచనలు సాధనసమితిలో సభ్యులుగానున్న మహాశయులవేయైయున్నవి. ఈ సమితినిర్వాహకులు గ్రంథరచనతో సంతృప్తినొందక, ఆంధ్ర రచయితలను ప్రోత్సాహించుటకై, కథానికలకును, ఏకాంకికలకును పోటీనేర్పరచి వానిలో ఉత్తమమైనవానికి తగిన బహుమతుల నిచ్చియున్నారు. ఈవిధముగా సమితివారిసేవ–ఈ ప్రాంతమున చేసినసేవ–యమూల్యమనిచెప్పుటలో అతిశయోక్తి లేదని భావింతును.

సమితివారివలన ప్రకటింపబడిన పుస్తకములు నవ్యాంధ్ర సాహిత్యమునకు సంబంధించినవై యున్నవి. వీనిలోని విషయములు, కథానికలు, వ్యాసములు, ఏకాంకికలు, పద్య

ములు, సాహిత్యవిమర్శనలు మున్నగునవి కలవు. ఇప్పుడు సమితివారివలన ప్రకటింపబడుచున్న "ప్రత్యూష" పై వాని లోనిదిగాక యొక క్రొత్త పద్ధతిననవలంభించినదని పాఠకులు చూడగలరు.

"ప్రత్యూష" కేవలము పద్యాత్మకము. దీనిలో ఇరు వందిని కవివర్యుల కొన్ని కొన్ని రచనలను ఒకచోకూర్ప బడినవి. కొన్ని వత్సరముల క్రింద ఆంధ్రమున "వైతాళికులు" అను పేరున క్రొత్తవారును ఉపజ్ఞకలవారునునగు పలువురు కవిశేఖరుల రచనలనొకతావున పేరికూర్చి ప్రకటింపబడిన పుస్తకము ఆంధ్రపాఠక ప్రపంచమునకు జ్ఞాపకముండునని తలం చుచున్నాను. ఆ గ్రంథమే సాధనసమితి కార్యనిర్వాహకులను "ప్రత్యూష" ను ప్రకటింపప్రేరేపించినట్లు కానవచ్చుచున్నది. దీనిలోగూడ ఈ ప్రాంతము, అనగా తెలంగాణమున, గడచిన కొన్ని వత్సరములలో రచయితలుగ ప్రఖ్యాతిగడించిన యువ కవుల పద్యములను గేయములను సంగ్రహించి కూర్చబడినవి. 'యువకత్వము' యొక్క మానము (Standard) నిర్ణయించుటకష్టమే అయినను, సమితివారివలన నీగ్రంథమున ప్రవేశమునందిన వారిలో దాదాపుగా నందరును నవీనులును, వయసుదాటని యువజనులలోని వారను అయియున్నారని నా యూహ. ఒకరిద్దరి పేళ్ళుమాత్రము పాఠక మహాశయులకు అపవాదములు గానరావచ్చును.

"ప్రత్యూష" లో ప్రవేశ గౌరవము గాంచిన వారిలో నిరువురు కవయిత్రులు నుండుట చాలయోగ్యముగనున్నది.

దీనిలో వచ్చిన కవి శేఖరుల జీవితాంశములను, సంగ్రహముగ నే యగుగాక, పుస్తకపు తుదిభాగమున చేర్చుట చాల మంచి పనియైనది.

మొత్తముమీద, సమితివారి యుద్దేశము, తెలంగాణమునను‌న్న నేటి కాలపు నవ్యకవులను, ఆంధ్రవాచక ప్రపంచమునకు పరిచితుల జేయుట యేయని స్పష్టముగా తెలియుచున్నది. ఇట్లనుట, నేటి తెలంగాణములోని యువ కవులందరును ఈ సంపుటమున గానవత్తురని తలంపవీలులేదు. ఇట్టి కవులలో నెక్కువ ప్రఖ్యాతి వహించినవారికి దీనిలో ప్రవేశము గల్గించు కృషి చేయబడినట్లు కానవచ్చుచున్నది.

పైన చెప్పబడిన విధమున యీ ప్రచురణము సమితివారి ప్రయత్నములలో ప్రత్యేకలక్షణము కలది. దీనిలో దోసగులేవైన దూరియుండవచ్చును. అట్టివి కానవచ్చినచో సమితివారి యుద్దేశము యొక్క యుత్కృష్టతను దృష్టిలో నుంచుకొని లోపములు క్షమార్హములుగా భావింపబడునని నమ్ముచున్నాను.

సాధనసమితియొక్క యువక కార్యకర్తల ప్రశంసించుచు, మనఃపూర్వక అభినందనములతో విరమింతును.

"ఆంధ్ర కుటీరము"
సుల్తానుబజారు, హై. ద.
౧౮ - ౭ - ౧౯౩౦

మాడపాటి హనుమంతరావు.

# విషయసూచిక


పుటలు

౧. శ్రీ దాశరథి కృష్ణమాచార్యులు ౧-౮; ౧౦౧-౧౦౪

తెలంగాణా విముక్తి

?

ప్రాగ్భూమి

కవితా కోపం

క్షమామూర్తి!

అమృత ప్రభాతము.

౨. శ్రీ భాగి నారాయణమూర్తి ౯-౧౩

ఆరాధన

భిషక్కు

తెనుగు మెంర

స్వాహా

౩. శ్రీ పొట్లపల్లి రామారావు ౧౪-౧౭

మహాత్వాకాంక్ష

జీవితము

౪. శ్రీ పులిజాల హనుమంతరావు ౧౮

సారస్య పటిమ

౫. శ్రీ ధవళా శ్రీనివాసరావు ౧౯-౨౬

మధుశోహా

అన్వేషణ

౬. శ్రీ గడియారం రామకృష్ణశర్మ ౨౭–౨౮

ప్రబోధము

౭. శ్రీమతి పర్సా జానకీదేవి ౨౯

ఋతుత్రయము

౮. శ్రీ బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి ౩౦-౩౫

సఖ్యం

ఫాల్గుణ అమావాస్య

౯. శ్రీ పల్లా దుర్గయ్య ౩౬-౪౪

సెలయేరు

మామ

౧౦. శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి ౪౫–౪౭

అంజలి

౧౧. శ్రీ గార్లపాటి రాఘవరెడ్డి ౪౮ ౪౯

సృష్టి

౧౨. శ్రీ పిల్లలమర్రి వేంకటహనుమంతరావు ౫౦-౫౧

సంక్రాంతి

శారద

౧౩. శ్రీ అప్పూరి అయోధ్యరామయ్య ౫౨

అడుగు జాడలు

౧౪. శ్రీ మూటుపురి వెంకటేశ్వరరావు ౫౩-౫౪

పువ్వా!

చందమామ

| | | |
|---|---|---|
| ౧౫. | శ్రీమతి సోమరాజు ఇందుమతీదేవి<br>గారి | ౫౫ |
| ౧౬. | శ్రీ కేశవపంతుల నృసింహశాస్త్రి<br>హితోక్తి | ౫౬-౫౭ |
| ౧౭. | శ్రీ సురవరము ప్రతాపరెడ్డి<br>తెనుగుతల్లి<br>మిత్రుడా! | ౫౮-౫౯ |
| ౧౮. | శ్రీ సిరిప్రగడ రాధాకృష్ణరావు<br>తెనుగుతోట | ౬౦-౬౧ |
| ౧౯. | శ్రీ పుర్పుటూరు రాఘవాచార్యులు<br>ఆంధ్రభారతి | ౬౨ |
| ౨౦. | శ్రీ సిరిప్రగడ భార్గవరావు<br>ఎందులకో<br>మధురపథము<br>సప్న సుందరి | ౬౩-౬౭ |
| ౨౧. | శ్రీ జమ్మలమడక సూర్యప్రకాశరావు<br>నీ రాక ! | ౬౮-౬౯ |
| ౨౨. | శ్రీ సన్నిధానం శ్రీధరశర్మ<br>మాయ | ౭౦ |
| ౨౩. | శ్రీ బూర్గుల రంగనాథరావు<br>ఆయాది ! | ౭౧ |

౨౪. శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనము ౭౧-౭౪

భానుపథము.

౨౫. శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు ౭౫-౮౦

పిల్లలమండీ పిల్లలమూ !

మా ప్రణయం!

ముల్లు

వేయి స్తంభాలగుడి

౨౬. శ్రీ దేవులపల్లి రామానుజరావు ౮౧-౮౭

సంక్రాంతి

పూలచెట్లు

౨౭. శ్రీ కాళోజి నారాయణరావు ౮౮-౯౨

నేను

హృదయావేదన

ప్రపంచం

ఆత్మహాతం!

దీపావళి

౨౮. శ్రీ వానమామలై వరదాచార్యులు ౯౩-౧౦౦

ఓరుగల్లు

దుక్కి–బక్క

పాదరక్ష

బిచ్చగాడు

*

# తెలంగాణా విముక్తి

(జైల్లోవ్రాయిన నా "తెలంగాణోపాఖ్యాన"మనే కావ్యానికి ఇది ఉత్తరానుబంధ భాగము.)

అవి తెలంగాణలోన దావాగ్నిలేచి
చుట్టుముట్టిన భీకరాశుభ దినాలు;
అవి నిజాము నృపాలుని అండ దండ
చూచుకొని నిక్కినట్టి పిశాచి కలలు.

నాడు మానవతీ నయనమ్ములందు
నాగసర్పాలు బుసగొట్టి నాట్యమాడె;
నాడు మానవతా పవ నాగరకత
తన్నుదిన్నది రాక్షసత్వమ్ముతోడ.

భారత భామినీ నయనభాగ వినిర్గత రక్తబాష్ప శృం
గారిత కాలరాక్షసి వికావిక నవ్విన నిస్వనమ్ములో
తూరుపు ఊరుపున్ విడిచి తొందరపడ్డది తెల్లవారగా
ఘోర నిశా తమఃపటల గుంఫిత నీల నభఃపథమ్ములన్.

పరశు నిశాత ధారలను పచ్చనిగడ్డి యెదిర్చినట్లు, రా
చరికపు టుక్కుచట్టమును చల్లగ ధిక్కరణమ్మొనర్చె ఉ
స్సురనెడి పేదవాడు, కడుచోద్యము: వెచ్చని స్నానమాడె సుం
దరతర భామినీ నయనధారల భారత మాతృ పాదముల్.

ప్రత్యూష

తరతరాల స్వప్నాల సుందర ఫలమ్ము
స్వైర భారతభూమి చూపడెనొ లేదొ
విషము గుప్పించినాడు, నొప్పించినాడు
మా నిజాంరాజు, జన్మజన్మాల బూజు.

భారత మాతృగర్భమున బల్లెము గ్రుచ్చిన దుండగీంద్ర కా
ధారముగా నిజాంనృపతి తాళముతీసిన పెద్దపెద్ద బం
గారపు బొక్కసాలు పసిగట్టెను తెల్లదళారి ; అంతలో
బేరముసాగె పోరు జరిపింప తుపాకులు దింపుకోసమై.

కోటి తెలుంగు లొక్కమొగి "కో" యని పిల్చిన యంతలోనె ఆ
రాటముజెంది భారత ధరాతలమంతయు పొంగివచ్చెబో ;
'కూటికిలేని పేదలకు గూడను పౌరుషమా !' యటంచు స్త్రీ
కోటిని మానభంగములకున్ గురిచేసిరి ముష్కరాధముల్,

చల్లని మంచుకొండలు భుజమ్మున మోసెడు భారతమ్ము శాం
తిల్లె నిజాము నీల్గుడులు తేటపడంగలదాక ; అంతలో
ఘొళ్ళున కుంద బ్రద్దలయిపోయెను ; భారతమాత డొక్కలో
కుళ్ళిన పుండు కోసి జయగోపురమెక్కె త్రివర్ణ కేతనాల్.

దూరాన నున్న 'చట్టము'
దూరాననె దూరె ; తెల్లదొంగ నభస్సం
చారియయి పారె ; స్వేచ్ఛా
భారత సైన్యంబు తలుపు బ్రద్దలుకొట్టెన్.

★

ఎదురెక్కియున్న జలములు
నదులై పారబారె యింటినడుమన్; రాముం
డదనున బాణము వదలెను
మది మిడగెన్ మా ప్రభుత్వ మారీచునకున్.

రెండువందలయేండ్ల చరిత్ర గదుల
కప్పుకొని యున్న గాఢాంధకార మెల్ల
కొట్టుకొని పోయె తూరుపు మిట్టమండి
పారి వచ్చిన వెలుతురు వాగులోన.

# ?

ఆ చల్లని సముద్రగర్భం
దాచిన బడబానల మెంతో ?
ఆ నల్లని ఆకాశంలో
కానరాని భానువు లెందరో ?

భూగోళం పుట్టుకకోసం
రాలిన సురగోళా లెన్నో ?
నర మానవరూపం కోసం
జరిగిన పరిణామా లెన్నో ?

ఒక రాజును గెలిపించుటలో
ఒరిగిన నరకంఠా లెన్నో ?
శ్రమజీవుల పచ్చి నెత్తురులు
త్రాగని ధనవంతు లెందరో ?

అన్నార్తులు అనాథలుండని
ఆ నవయుగ మందెంత దూరమో ?
కరువంటూ కాటకమంటూ
కనుపించని కాలా లెపుడో ?

అణగారిన అగ్నిపర్వతం
కని పెంచిన "లావా" యెంతో ?
ఆకలితో చచ్చే పేదల
శోకంలో కోపం యెంతో ?

పసిపాపల నిదుర కనులలో
మురిసిన భవితవ్యం యెంతో ?
గాయపడిన కవి గుండెల్లో
వ్రాయబడని కావ్యాలెన్నో ?

కులమతముల సుడిగుండాలకు
బలిగాని పవిత్రు లెందరో ?
భరతావని బలపరాక్రమం
చెర వీడే దింకెన్నాళ్ళకో ?

# ప్రాగ్భూమి

పడమటి బొల్లి గద్దలు
పొడిచి పొడిచి తిని విడిచిన
అగ్నిసంస్కారం నోచని
నగ్నశవం ప్రాగ్భూమి.

మతాలతో గతాలతో
చితి రగిల్చి పడి చచ్చే
అన్నదమ్ముల చల్లని
కన్నతల్లి ప్రాగ్భూమి.

కరువుల తెర చాటున
మరణాంగ నాలింగనంలో
కను మూసిన నిరుపేదల
ప్రణయశాల ప్రాగ్భూమి.

తీగె విడిన దివ్యవీణ
మూగవడిన నాగస్వరం
కదలని వదలని అంతః
కదనపథం ప్రాగ్భూమి.

బూజెక్కిన కీలుబొమ్మ
రాజులపై జాజు బూసి

తాజాగా అమ్మిన అంగడి
బాజారిది ప్రాగ్భూమి.

లక్షలాది పేదల ప్రాణాల్
అక్షింతలుగా చల్లే కొన్ని
లక్షాధికార్ల పాలిటి
లక్ష్మీదేవి ప్రాగ్భూమి!

# కవితాకోపం

పాడను,
పాటలు పాడను;
వాడను
పదాలు వాడను;
వేడను,
దేవుళ్లను దయ్యాలను వేడను;
ఓడను,
రాజుకు, రారాజుకు
తారా రాజుకు ఓడను;
గోడను,
ధనవంతుల కనకసౌధ
మున కివతల వణికే నిరుపేదల
అడుసు గుడిసె గోడను.

నన్ను చూచి ఎందుకో
మిన్నాగులు ఇట్లా
పొరాడుతు జీరాడుతు
వస్తుంటాయి ?

నన్ను చూచి ఎందుకో
పున్నాగులు ఇట్లా
తారాడుతు, గోరాడుతు
పూస్తుంటాయి ?

ఇది లోకం
నరలోకం
నరకంలో లోకం నరలోకం!

ఏనాడో తెలుసునాకు
ఈనిరీహ నీరవ
నిస్వార్థ నిర్ధన
నీచ నీచ మానవునికి
విలువ నీడ లేదు జగతి.

లేదు లేదు విలువ లేదు,
రక్తానికి ప్రాణానికి
శ్రమకూ సౌజన్యానికి
రచయితకూ శ్రామికునికి
రమణీ రమణీయ మణీ హృదయానికి
విలువ లేదు, విలువ లేదు.

నేనుగూడ వొక గూండానై
పుండువడిన గుండెలతో
మొండివడిన కండలతో
మొండివడిన గుండెలలో
పుండువడిన కండలతో
దౌర్జన్యం చేయాలేమో !
సార్జంట్లనె దోయాలేమో !!

ధూర్జటినై
మార్జిన్ వేయాలేమో ! ఈ
ధనార్జనాపర, పరపీడాకర
నిరుదార నిరంకుశ
నీరస నిస్తేజ లోకానికి
మార్జిన్ వేయాలేమో

ఫాలనేత్ర విలయాగ్ని మాలతో
నీలగాత్ర విషవగ్నికీలతో !!

దాశరథి కృష్ణమాచార్యులు

# ఆరాధన

పసిపాప నవ్వులో - ప్రత్యూష రేఖలో
చిరుకన్నె కులుకులో - తొగకన్నె వంపులో
చూలాలి నడకలో - చలి వెలుగు అడుగులో
కలతపడు హృదయాల - గర్భిణీ మేఘాల
తొంగలించెడి శక్తి - తొణుకులాడెడి శక్తి
కంజలిడుదు ;

తొలివాన చినుకులో - ప్రియురాలి పిలుపులో
పసిపైరు మిసిమిలో - ముసినవ్వు కొసరులో
వరిపాల కంకిలో - సఖిపూల యెదదలో
బాలింత చేలలో - పసిపిల్ల తల్లిలో
తొంగలించెడు శక్తి - తొణుకులాడెడు శక్తి
కంజలిడుదు ;

నడిప్రొద్దు ఎండలో - యవ్వనపు కండలో
ముదిప్రొద్దు ముసుగులో - పండినా బ్రతుకులో
నడిరేయి కడుపులో - కనుమూయు బ్రతుకులో
తొంగలించెడు శక్తి - తొణుకులాడెడు శక్తి
కంజలిడుదు ;

గడ్డపారలకైన మొక్కవోవని
నల్లకొండలా గుండెలన్

చీల్చుకొని చిగురించు
తలిరాకు తీవలో

విసము గ్రక్కుచు నిక్కి బుసకొట్టు
నల్లత్రాచులా గుండెలన్ కరగించి వూగించు
నాగుల్ల పాటలో
తొంగలించెడు శక్తి - తొణుకులాడెడి శక్తి
కంజలిడుదు.

# భిషక్కు

ఉషః సంధ్యల పండిన బంగారం
కరగించుక త్రాగిన
కాలానికి కరువునెప్పి వచ్చింది;
నయంచేసే భిషక్కు ఏడీ?
గానంచేసే రసజ్ఞుడేడీ?

సామ్రాజ్యాల్ తెగమ్రింగిన
కాలెడు కడుపుల ఆకలి త్రాగిన
లోకానికి క్షయరోగం వచ్చింది;
నయంచేసే భిషక్కు ఏడీ?
గానంచేసే రసజ్ఞు డేడీ?

ముసలి బాటల మూల్గుచు నడిచే
సంఘానికి చత్వారం కలిగింది ;
నయంచేసే భిషక్కు ఏడీ ?
గానంచేసే రసజ్ఞుడేడీ ?

# తె ను గు మొ ర

తేనెలు పిందే తెలంగాణము
నెత్తుట ముంచెత్తెదరా ?
తెప్పరిల్లిన, ఈ తెలంగాణము
కుత్తుక బట్టొత్తెదరా ?

తెనుగు తల్లుల పాలు త్రాగిన
ఓ నా తమ్ముల్లారా !
తెనుగు తల్లుల ఒడిలో పెరిగిన
ఓ నా అన్నల్లారా !
తేనెలు పిందే....
అటు చూడుడు అటు ! అటు
చూడుడు !!

కన్నులు విప్పి మరికనుడూ
తుమ్మపూల తురాయి పెట్టుక
తళ తళ లాడే తటాకలక్ష్మి

వెల వెల పోయిందీ—
అడవుల పాలై ఆలమందలు
డొక్కలు కాల్చుక దిక్కు
మొగముతో
దిక్కులు చూసేనూ...
తేనెలు పిండే...
అటు చూడుడు అటు! అటు
చూడుడు !!

కన్నులు విప్పి మరికనుడూ
మేడలు కూల్చిన మనకేమొరుగు ?
ఒకటికి రెండూ కట్టందోయ్—
అడవులు మనవే, వేల మనదే
ఒకటికి రెండూ కట్టందోయ్
తేనెలు పిండే...

పీకలు కోసి ఇళ్లదోచీ
ఏమది సాధించినదీ ?
ఒక పీకకు పదిపీకలు బలి —
ఒక ఇంటికి పది ఇళ్లూ మట్టం

తల్లికి బిడ్డా తండ్రికి కొడుకు
మగువకు మొగుడూ కనబడక

అభము శుభమెరుగ నమాయకపు
తెనుగు లలమటిస్తున్నారు—
తేనెలుపిండే తెలంగాణము
నెత్తుట ముంచెత్తెదరా ?
తెప్పరిల్లిన ఈ తెలంగాణము
కుత్తుక బట్టొత్తెదరా ?

## స్వాహా

అతడు పంటకు వచ్చిన పైరు —
ఆమె నీరు దిగని నీలం —

తను పెంచిన అవినీతికి
తను పంచిన పంచాగ్నికి
రగిలి రగిలి అగ్గియైనా డతడు —
అతని ఎదమంటల కాకకు
కళ తరిగి బొగ్గయిందామె —

కూలిన ఆ జంట బూది
వీబూది పెట్టుకొని
మడి కట్టుకొని
నంగనాచీ లాగ
కొంగ జపం జేస్తు
కూరుచున్న దీ కపట లోకం —

ఎవని కళ్లు మూయుటకు ? మ
రెవని ఇల్లు దోచుటకు ?

భాగి నారాయణమూర్తి.

# మహత్త్వాకాంక్ష

నీచేయు పనిఏదో నీవు చేయుము కాని
అన్యులను నీవేల అనుకరించెద వోయి?

ప్రత్యేకముగ నీవు
పట్టింపుతో చేయ
వలయు కార్యం బొకటి
కలదు ఈ భువి సఖుడ !
ఆ కార్య మిపుడప్ప
అన్యులతో కాదోయి. నీ॥

చిలుక పలుకులు పలుక
శృంగార మెవ్వరికి ?
నీ ఆత్మకే నీకు
నిండులేనిచో యింక
ఏరి సంతృప్తి కిటు
ఈ ఆటలాడెదవు ? నీ॥

అనుకరణలో మ్రగ్గి
ఆత్మజం పెదవేల ?
ఆత్మ వ్యక్తీకరణ
అదె సృష్టి పథమోయి. నీ॥

ఒరుల దుస్తుల దాల్చి
ఊరేగుటలు మరవు !
రాజ రాజువు సరియె
రాణింపు నీకేది ! నీ॥

మెఱమెచ్చులకు నీవు
మురిసిపోవగ దలచి
వెనుక ముందూ లేక
అనుకరింతువు ఒరుల !
మాయ, మోసం బెపుడు
మహి నిల్చునా హితుడ ? నీ॥

పలుకుమని నిన్నెవరు
పాడుమని నిన్నెవరు
బ్రతిమిలాడిరి, హితుడ !
బలిమిచేసిరి సఖుడ !
పాడినదె పాడుటకు
ప్రళయ మింతేమిటికి ? నీ॥

కోకిల పాటేదో
కోకిలయె పాడాలె
కాకి పాడిన నెటుల
కనుపించునో చెప్పు ? నీ॥

పరుల గొప్పల పైని
భ్రమవదల నన్నాళ్ళు
నీ గొప్ప ఏమిటిదో
నీకు తెలియదు సఖా !

నీ పలుకు ఏదైన నీ పాట ఏదైన
నీ అంతరము నుండే నీటుగా రావలయు.

# జీవితము

జీవచ్ఛవముగ ఏటికి
చిరకాలము బ్రతుకవలెను ?
ఒక్కగడియ చాలదోయి
ఉజ్జ్వలమగు జీవితమ్ము !

జీవించుట యనిననురిక
జీవించుట కాదెప్పుడు
జీవమె లేకున్న నద్ది
జీవన మెటులగునోయి ?

జీవము నీ జీవనముతో
చిందులాడవలెనన్న
జీవితమునె బలిగనీవు
జేసి తీరవలెనోయి.

పిడికిలి బిగియించినీవు
బేరమాడ దలచినావ ?
మూల్యమివ్వకే జగతిని
ముట్టలేవు ఏవస్తువునైన !

నీకు వలయు వస్తుచయము
నిఖిలముయిట లభియించును
మూల్యము సిద్ధముచేయుట
ముందు నీదు కర్తవ్యము ;

కాసయినను చేతలేక
కామితార్థ మెవడుపొందె ?
గుడ్డిగవ్వ కొనుటకైన
గుడ్డిగవ్వ కావలయును !

పిడికిలి బిగియించినీవు
బేరమాడలేవు ఎపుడు
నీ చేయె ఆడనిచో
ఏచేయి ఆడునిచట !

ఆశ్చర్యంబుగ జగతిని
ఆలోకన జేయ ఫలము.
శక్తి ఉన్న బేరమాడు ;
చాలనిచో దయచేయుము.

పొట్లపల్లి రామారావు

# సారస్య పటిమ

గుమ్మ పాలల్లోని గోరెచ్చదనము
తమ్మితూడుల గ్రమ్మి తరలు సూక్తుల్లు.
అరటి పూవులలోని అందంపు సిగ్గు
పరువెత్తు పిన లేడి బరువంపుశైలి.

బీరపూవులవోలె విచ్చుభావాలు
కోరకంబులదాగు క్రొందేనెరుచులు,
వెలుగు కంటికి రెంట విడిపోనిజంట
దలపింపజేయు శబ్దార్థ వైచిత్రి.

జంటబాసిన గువ్వ సాగించురొదలు
పంటబోయిన రైతు పలవించురీతి
అంబాయనెడి లేగ ఆవేదనంబు
సంబోధనలకొత్త సారస్యపటిమ.

తొలికోడి కూతగా తోచుజ్ఞానంబు
తెలవారు చుక్కగా తీరించునాశ
దుష్టుల పేగులే తోరంబులొప్ప
కష్టజీవులకునై గంగావతరణ.

అందరకు అందింతు మానంద మెపుడు
సుందరోద్యాన హృత్సుమ శీకరముల.

పులిజాల హనుమంతరావు

# మ ధు రో హ

నా శక్తిని విన్నారా!
నా బలమును గన్నారా!
నేనొక విషాదగీతిని
నేనొక విశుద్ధ హేతిని
నాదొక భయంకరాస్త్రం
నా కలమే బ్రహ్మాస్త్రం,

నా పాళీ కనురెప్పలు
పుర పుర బొక్కి పొక్కి
దొరలించిన సెలయేరుల
జలవాహిని
తరతరాల తరబడిగా
తలలను నిక్కించి లోన
చలనము రవంత లేక
సమాజ సౌందర్యానికి
సమాజ సౌభాగ్యానికి
దారులు నిర్మిస్తూంటే
దోవల కడ్డము నిలిచిన
కొండల ఛేదిస్తుందోయ్!
బండల కరిగిస్తుందోయ్!!

మండుటెండ వడ తాకున
ఎండి ఎండి జీవించుటె
దండుగయని,
వాడిన కోర్కెలు దొడిగి
వీకిన యాసల దలచి
విల విల లాడుచు మూల్గే
పొలాల గుండెలు తడిపి
రాజనాలు పండిస్తుందోయ్ !
భోజనాలు నిండిస్తుందోయ్ !!

నా పాళీ వాతెరలో
రూపొందిన లేనగవులు
హవాయి చువ్వల్లాగా
వెన్నెల బాంబుల్లాగా
ఎగసి యెగసి పైకెగసి
తెలివెలుగుల జడివానలు
జిలికిస్తే
సమాజ సౌధాంగణమున
యుగయుగాల నాశ్రయించి
బిగిసి బిగిసి
బలిసి బలిసి
దిబ్బలుగా పాదుకొన్న
చీకటి దయ్యాలు కరిగి

ఏ కడకో ప్రవహిస్తావోయ్ !
లోకాన్నే వదలేస్తావోయ్ !!

మొనదేరిన నా పాళీ
కొనవొక్కులు
సమాజ రక్తమునంతా
సమాజు పూజల పేరున
ఆ మదముటు లారగించి
ఆరగించి
వెరిగిన దీపాల పొడిచి
నిప్పున ముంచేశావోయ్ !
వెలుగకుండ జేశావోయ్ !!

నా కరం
పూర్వం
మన్మథుని కుసుమ శరీరం;
వెన్నెల ఉచ్చులు బన్ని
వసూధినీ హృదయాన్ని
వ్యథలపాలు చేసిందానాడు;
మదనుని మంటల కొడిలో
గిరి కన్నెను పొరలించి
మల మల మాడ్చిందోయ్ !
వల వల యేడ్పిందోయ్ !!

నా కలం
నేడు
బలరాముని హలం;
తెలుగువారి పొలాలనడుమ
చిరుకాల్వల తీర్చిదిద్ది
పసిడి బోదెలను బోసి
బంగారం పండిస్తుందోయ్ !
నూతన
శృంగారం సృష్టిస్తుందోయ్ !!

నే నెవరో
ఎన్నెరుగరు;
కవిని — కాదు
గాయకుడను
శిల్పి నంటారేమో-
అదిగా దిదిగాదు; నేను
మధురోహాను !
మధురోహాను !!

లోకాలను దాటిపోయి
ఆకాశపుటంచులలో
విహరిస్తా నొకసారి;
పేదవడిన జాలిగుండె

సొదలోనే నా పొదలు;
కాలపు గట్లను త్రెంచి
చేలల్లో తిరుగుతాను
మాలల్లో మసలుతాను.

నే నొక
సుధురోహాను
మధురోహాను.

# అన్వేషణ

వెదకి ప్రాణాలట్టె విసుగెత్తె, నీ జాడ
నెరుగ నీ వేడుంటివో కదే ప్రియసఖీ!

కులుకు బంగరు కళల
నొలకించు తొలిప్రొద్దు

పడుచు మొగమునుజూచి
భ్రమసి పోయితి నీదు

నునుపు చెక్కిలి కొనల
దొనకు లేత గులాబి

నవకంపు క్రొంబూత
నాట్యమేమొ నటించు! ॥వెదకి॥

ఈ వసంతపు సంజ
దోవలో మెరుగారు
కావిమబ్బుచె రంగు
కదలి యాడిన యంచ
కలికి నీ పెదవిలో
మొలకెత్తు చిరునవ్వు
ఉలుకు కెంపులటంచు
దలపోసి వెదకితిని ! ||వెదకి||

చివురు దొడిగిన తీవె
చేడె కౌగిట
పూవుబోడి కమ్మని
తేనె పుక్కిలింతలలోన
నీ మోవి తేనె వాకలు
నిండి పారినవి
వలపు వెదుకాడి నే
నలసిపోయితి చెలీ ! ||వెదకి||

కొండ కోనల నిదుర
కూర్కొరుంగక రేయి
రొదసేయు సెలయేటి
కొదపు పాటలు చెవికి

దవిలినంతనెలేచి
తడవికొందును నీదు
చెలువంపు పీఠీయలు
పలికె నేమోయంచు. ||వెదకి||

ఈరేయి చలువ వె
న్నెలలో గుబాళించు
పూవు. కన్నెల పలపు
తావులను కొల్లగొని
మెల్ల మెల్లగ దాటు
పిల్లగాడుపు మేన
.సోకినంతనె నీవు
సోలి వ్రాలితివనుచు
చీకాకుతో దిగ్భ్రమను
జెంది వెదకుదును. ||వెదకి||

పసరుబట్టిన మొలక
ప్రాయంపు చేలలో

దెస దెసకు ని మేని
కొసరు టందాలకై
నిలువెల్ల కనులతో
నే వెదకి వేసరితి. ||వెదకి||

ఏ తెలుగు కన్నె కోయిల
కలుపు పాటనో ?
ఏ తెలుగు గొల్లపిల్లన
గ్రోవి యూపుననో ?
ఏ యడవి కోననో
ఏ మొయిలు నీడనో ?
ఏ పేద కన్నీటి
యేటి దరిదాపుననో ?
ఏ జాలిగుండె మరుగున డాగినావో
నీ వేడనుంటివో ? ||వెదకి||

ధవళా శ్రీనివాసరావు

# ప్ర బో ధ ము

సీ. ఆంధ్ర సామ్రాజ్య సింహాసనాలంబిత
విస్మయావహ మహో విక్రమంబు
సర్వజ్ఞ సింగమ క్ష్మాపాల సాహిత్య
పాండిత్య చిరయశః పాటవంబు
వివిధ దేశఖ్యాతి విలసిత "ఎల్లోరా
జంతాగుహా" శిల్ప సౌష్ఠవంబు
ఢిల్లీ-సురత్రాణ ఖల్లాయి తాక్కన
మంత్రీంద్ర ధీశక్తి మండనంబు

గీ. మరచి నడపీనుగుంబోలె తిరుగు నిన్ను
వెలికి గొనివచ్చి వెలిగించు విజయదినము
వచ్చి యున్నది పూజింప వలయులెమ్ము
మేలుకొమ్మోయి! ఆంధ్రుడా మేలుకొమ్ము.

సీ. పలికించినారు శత్రులు దల్లడంబంద
కత్తులపై వీర గాథలెల్ల
చిలికించినారు చంచల చిత్తులకు ప్రీతి
నుపనిషద్వాక్యపీయూషవృష్టి
వినిపించినారు దర్పిత పండితాళికి
వీరాంగ విజయ భేరీరవంబు

గలిపినారలు రాతి కలకు గుండియలకు
మందార మంజరీ మార్దవంబు

గీ. నింగి కెత్తించినారు నిర్నిద్ర శౌర్య
సాహసౌదార్య వినయ రక్షాధ్వజంబు;
పూర్వ జాతీయ గౌరవాభ్యుదయమైన
తలచి నడుము బిగింపవా తెలుగువాడ.

సీ. గ్రీకుల దాడికి చీకిన నీతితో
సకల విజ్ఞానంబు సమసిపోయె
పరమతా సహనంబు బాపిన బుద్ధిలో
వేద వేదాంతాల విలయమయ్యె
తురకలు గూల్చిన దుర్గాలతోబాటు
మతశిల్ప శాస్త్రముల్ మంటగలసె
ఆంగ్లేయులార్పిన ఐకమత్యంబుతో
రాజ్యాంగ తంత్రంబు భ్రష్టమయ్యె

గీ. కొంప గాలినదని మొత్తుకొనుచునుండ
దొంగ జొరబడి దోచిన భంగినున్న
మన పరిస్థితి సరిజేసి కొనుటకైన
చేయిగల్పుడు ఆంధ్ర దేశీయులార.

గడియారం రామకృష్ణశర్మ

# ఋతుత్రయము

మానవ జీవతమ్ము మధు
　　మాస వసంత మనోజ్ఞ శోభతో
వానలతో, మహాశిశిర
　　వాయువుతోడ ఋతుత్రయంబు పెన్
కానల దూరినట్లు కల
　　గా పులగమ్మయిపోయె పేదకున్
వానలు కొల్లలౌను, చలి
　　బాధలు హెచ్చు, వసంతముల్ త్రుటుల్

మానవులలోన ధనికుడు మాన్యుడగును
ఆకలికి రోయువాడు పుల్లాకుసుమ్మి!
అందు ప్రథముని జీవితమంత మధువె;
మొండివాన రెండవవాని గుండెలందు.

చైత్ర వైశాఖమాస వాసంతశోభ
ధనిక లోకంపు విశ్రాము ధామమయ్యె;
శ్రావణాషాఢ నిబిడ వర్షానిశాత
మస్సు పేదకు మృత్యు ధామమ్మెయయ్యె.

పర్నా జానకీదేవి

# స ఖ్యం

నీ లాస్యము పాయసమైతే !
నా ఆస్యము ప్రేయసమైతే !
నీ చూపు ద్విరేఫంబనగా,
నా దాపులు సఫలంబనగా,
ప్రేమ లతాంతమున వసింతాం !
దామ హృదంతమున రసింతాం !!

నీ మంజుల మంజీరంబే
నా రంజిత కంజాతంబే.
నీ యానము నిట్టూరిస్తే
నా గానము లొట్టలువేస్తే
భావసుమాధ్వమున వసింతాం !
రావ మధూత్తమున రసింతాం !!

నీ శోభా ప్రాభాతంలో
నా స్వాభావా భూతంలో
నీ హృదయము మధురంబైతే,
నా పథకము విధురంబైతే,
ఆ శాసిత వసతి వసింతాం !
భాసాకృత విస్మృతి రసింతాం !!

నీ సుందర నిరాదృతంబే
నా మందరకరా వృతంబే,
నీ మనసొక నిచ్చెన వేయన్,
నా గుణమొక మచ్చున రాయన్,
భాగమృదంగముల వసింతాం !
రాగ తరంగముల రసింతాం !!

నీ ప్రణయము నిస్తులమేమో !
నా అనునయ మతులంబేమో !
నీ భావపు ప్రాభవమిల్లై,
నా భావికి లాభములల్లై,
సూనాంగణత లినివసింతాం !
ప్రాణంబుల కలిపి రసింతాం !!

నీ హాసనము ప్రసవంబగులే !
నా రసనము అసదృశమౌలే !
నీ ఆడినగాత్రము పొగులన్
నా పాడిన గీతము రగులన్,
ఖ్యాతోపక్రమత వసింతాం !
జ్యోతిశ్చక్రమున రసింతాం !!

నీవే యొక మృదువాక్యమువై !
నేనే యొక మధుకావ్యమునై !

నీ విరహము నిర్వ్యాజముగా
నా దరహాస మూర్వీజముగా,
పూవులలో తావులమౌదాం !
తావులలో పూవుల మౌదాం !!

నీ శిల్ప మహాన్యాసము నేనై,
నా అల్పవి పర్యాసము నీవై,
నీ భంగిమమే రంగులు గాగా,
నా యింగితమే, పొంగులుబోగా,
చిత్రాకాశము చేరుపబోదాం !
యాత్రా పేశల పాకముచూదాం !!

నీ హావంబున నేనైతే !
నా భావంబున నీవైతే !
నీవే కోకిల ముగ్ధవుగా,
నేనే హర్ష మయూరునిగా,
ఆ వసంతమున నాలాపిద్దాం !
ఆ వర్షంబున నాటల నాడ్దాం !!

నేనే నీవై, నీవే నేనై !
నీవని నేనని లేకుండా,
నిఖిల జగత్తున నిభృతులమై,
సఖుల వియత్తల కథకులమై,
దుఃఖలోకమును ఆశ్వాసిద్దాం !
సఖ్యజీవులుగ నిశ్వాసిద్దాం !!

# ఫాల్గుణ బహుళ అమావాస్య

" ఎండు లెండోయి విశ్వము మండిపోవు
చున్నదో గాథ సాప్తికాపన్నులార ! "
అనుచు కేకలు వినబడ నవరి లేచి
చూచినాను —
మోదుగు కొమ్మ జుట్టునిండ
మండుచున్న మాలలు గట్టి మాయమైరి
ఎవ్వరో !
తేటి పిండులు ఎగసినట్లు
పొగలు గ్రమ్మెను !
నేలపై, పొట్టకంటి
పట్టుకున్న మర్కటశిశు మాత వలెను
ఎవరుగని పల్కరించని వృద్ధ దేహ
ములు, దరిద్రభారమ్మును మోసికొనుచు
పోవుచున్నది మంటలో, పొగలలోకి
ఎందుకో ! ఎవ్వరో ! !

గుండెలు జల్లరించి కనుగోసలు మూసుకపోయె నాకు ! బ్ర
హ్మాండము పిక్కటిల్లినటులాయెను భావము వాక్కుకందక ! 
దండిగ కొంతసేపటికి దాపున జూడక జూచినాను ఏ
కొండలలోనికో ! విధుర కోకిల రాగపురేఖ విస్పదెక ! !

ఆకలివాధతో నవయుహార్ద కృశోద్గళ భావ భార మే
దో కల నాదజీవిత మధూదయ దర్శనమయ్యె ! తంబురా
తాకుచు జీర్ణసాగర కథాకళి నృత్యవు పొంగు, క్రుంగులన్
వ్యాకుల గీతిబాడె ముది వగ్గగు భిక్షుకి నన్ను జూచుచున్ !

" పండిన యాకు లే పగదిపడ్డవొ చూచితిరేకదా ! ఇకన్
మొండిగనున్న యీ ముదురు మొవ్వులదూయుడు క్రొంజివుళ్ళనే
పండుగజేయుడో ప్రజలు ! భాగ్యవిహీనులు లేరు, పూలవో
దండలు దండలౌచు వసుధన్ సుధగా మధుధార దేల్చెడున్ !"

అనుచునె వచ్చి దగ్గరకు అర్థముకానివి పాట లెవ్వియో
వినుచుచునుండె ! నా యెదను వేడిమి గాడ్పులు వీచి దేహమె
ల్లను చిరుచెమ్మటల్ విసిరె ! లజ్జ, భయంబును బుల్కరించె ! సం
తనె కనుచుండగా, నొక లతాంగిగ గన్పడె మాధు వీణతో !

ఆ సౌందర్య మహాఃప్రవాహమున నేమైనానొ ! నా గుండెలో
దూసెన్ బోలును మ్రోడుటాకు, లిక వాదుల్ సేతు రో కోకిలా
శ్రీ సమ్మోహగళుల్ ! వియచ్చర ప్రమద హంసీ పాద నాదామృత
ధ్యాసన్ ఆశలు ప్రాకులాడి, భ్రమరీ ధమ్మిల్లమున్ గాంచితిన్ !

శారదాప్రియస్వి నీ రమ్య ముగ్ధాక్షు
లలర, ఒదిగిచూచి పలుకరించె !
వీణమీద కరము విప్పారనేలేదు
పెదవి కదుపలేదు పృథివి మ్రోగె !!

" రమ్మ రమ్మోయి సఖుడా విరాగమేల !
విశ్వమంత వసంతము వినవొ—కనవొ ! !
ఋతు మహా ధర్మచక్ర పరిభ్రమణము
తీరుగానె కాలము రూపు మారునోయి !

నీ గళాన రసము నిండింతు నీవేళ !
నీ కరాన చిగురు నిలుపుదాన !
హిమ శిశిరదవార్చు లెగసిన దిశ్వాన
భావ పుష్పవృష్టి వరపుమోయి ! "

అనుచు నెదురువచ్చి ఆలింగనంబున ·
ఎత్తెనేమొ నా తలెత్తి చూడ
నిజమొ ! అన్నృతమేనా ! నే నమ్మలేనైతి
తెల్లవారుజాము తియ్యనికల ! !

బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి

# సెలయేరు

కనుమేర దూరాన
కనుపించు నా కోన

నల్లనౌ తల కొంత
నరసి పండినదేమొ !

నరపుగాదది నల్ల
నల్లనౌ తలమీద

తెల్ల మల్లురుమాలు
తీరేమొ కనుపించు !

మల్లుపాగాలోని
మలకలవి యొక కొన్ని

చెదరి గాలికి చాల
చెలరేగె ననిపించు !

కాదు, నల్లనిరాతి
కంబళంబున దూది

యేకిపోసిన రాశి
యేకమైనటులుండె !!

పైనున్న యారాశి
పాల సంద్రమటంచు

నాగుబాములు కొన్ని
నడయాడునటులుండె

నెత్తిగాదది కొండ
నెత్తమ్మె యగు సుమ్ము

నరపుగాదది మంచు
టొరపు పరపగుగాని !

మల్లుపాగాగాదు,
మఱి చూదియునుగాదు

నడయాడు నిడుపాటి
నాగుబాములు కావు;

కొండ నెత్తమునుండి
రెండు మూడుగ జీలి

జల జల ప్రవహించు
సెలయేరు లగుగాని.

## 2

కొండపై వ్రారెవరొ
వెండి గరగిన నీరు

కుండతో గుప్పుమని
కుమ్మరించిన భాతి,

స్వర్ధునీ వీచిక
జల్లులాడెడి కరుల్

తొండాలతో ముంచి
తూరుపెత్తినరీతి,

మంచుకొలకుల తాన
మాడిలేచిన దివ్య

వారకామినియార్ద్ర
వసనాంచల మనంగ,

వేయికన్నుల తెప్ప
వేయకే సురరాజు

పదిలపరచెడి సుధా
భాండంబు దొరలెనన,

తళతళ త్తళతళ
త్తళతళత్కాంతితో

జలజలన్ జలజలన్
సెలయేరు ప్రవహించు.

## 3

ఉత్తుంగ శిఖరమ్ము
నుండి యటు పయనమై

ఆడాడ పల్లమ్ము
లందెగిరిపడి దూకి

మలకలై మెలిపడుచు
మజల విడివడి సుడులు
తిరుగుచును పొరలుచును
నురుగులయి పరుగిడుచు,

దండిగుండులు కొన్ని
పిండిగొట్టుచునంత
చెలరేగి గుండ్రాళ్ళ
చెండ్లాట లాడుచును,

పచ్చి ముత్తెపు సేసఁ
బ్రాల జల్లులతోడ
తను తొంగిచూచు భా
నుని పూజలను సలిపి,

సూర్యుడును చంద్రుడును
చుక్కలన్నియు గూడి
మోసులెత్తినక్రొత్త
మోహంపు మైకాన

పవలు రాత్రియు వెంట
పరువులెత్తుచు నుంట
అందరను తనయందు
ఐక్యమొనరించుకొని

జలజలా జలజలా
జలజల ధ్వనులతో
తలపొలమ్ములలోకి
తాచూరె సెలయేరు.

## 4

సానువుల శిఖరాళి
తో నేకమొనరించి
ఆసు బోసినరీతి
నటు నిటుం దిరుగాడి,

పాదరసపుం గుండ,
పగిలి పారె ననంగ
మరకతపు పచ్చికల
మళ్ళలోపల దూరి,

నికటస్థలము లెల్ల
నిగనిగన్నిగలాడి
చూచువారల కనుల
దోచుకొనునటుచేసి.

పంటచేడియ ఆకు
పచ్చకోక పయంట
ముత్తెంపు జలతారు
మురువుపోతలుపోసి,

దోరపూవులు కొన్ని
దోసిళ్ళ గోసికొని

పరిమళము మైనింద
పట్టించుకొని లేచి,

దారికడ్డుగనున్న
తరుల మూలము లొరసి

పక్వఫలముల పుడమి
పడ రాలగాగొట్టి

ఫలరసా స్వాదనా
బలమెసక మెసకగా

పూల సొమ్ముల నొడల్
భూషించుకొని మురిసి,

కలనాదముల నెడద
పులకితంబగు చుండ

నలుదెసలు వెలుగ చిరు
నగవు చూపులు విసిరి

ఎందు చూచినగాని
యెదురెవ్వరును లేక

ఇచ్ఛా విహారమ్ము
నిటు కొంతతరి సలిపి,

చిటిపొటినడల హం
సిక వోలె నపుడేగి

చంద్రికాకాంతి, వా
సవసజ్జ పోలికను,

చెలిమితో ప్రకృతి, స
జ్జితము చేసిన మిసిమి

యిసుకపొన్పున బవ్వ
ళించె నా సెలయేరు.

## మామ

మామామ వచ్చిండు
మాకేమొ తెచ్చిండు,

మంచిము త్యాలివే
పంచుకొం డన్నాడు,

బొండుమల్లెలు కొంగు
నిండ విర చల్లిండు

దండ లల్లిన నల్లు
కొండుమీరన్నాడు.

పచ్చిపాల్ దెచ్చిందు
పారనే పోసిందు,

ఎత్తుకో గలరేని
యెత్తుకొండన్నాడు.

అమృతభాండముదెచ్చి
అటుకుపై నుంచిందు

అందుకో గలరేని
అడ్డ మెవరన్నాడు.

పలుగురా కొండెక్కి
పగలబడి నవ్విందు,

పట్టుకో గలరేని
పట్టుకొండన్నాడు.

దొరవోలె వస్తాడు
దొంగవలె పోతాడు,

కనుమూసి తెఱచులో
కనపడడు మామామ.

ఎంచిచూడగ చాల
మంచివా డాతండు,

చల్లదనముల పుట్టి
నిల్లగును మామామ.

దొడ్డగుణముల వాడు
దొరతనము గలవాడు,

నలుపెల్ల దిగమింగి
తెలుపులే వెదజల్లు.

మామామ కడుపులో
మచ్చగను పిస్తుంది,

లోకోపకారమై
చీకట్లు మింగిందో.

మామలకు మామ, రా
మాచంద మామ,

మామ మామకు మఱది
మా చందమామ!

పల్లా దుర్గయ్య

# అంజలి

ఉ. శ్రీ లలనామణిన్ గలిసి ప్రీతిగఁ గాపురమున్నఁగాత మ
మ్మేలు తెలుంగు శారదకు; నెయ్యెడఁ గాంచిన దేశభాషలన్
మేలని కీరతిన్ గనుచు మేదిని భాసిలు కన్నతల్లి మా
పాలిటి కల్పవల్లి సుతపాళి నివాళులఁదేలి యేలుతన్,

సీ. శాలివాహనరాజచంద్రులయేల్బడి
నిగ్గు దేరినపంటనేల యిద్ది:
చాళుక్యభూమీంద్రసమదసామజదాన
ధారలఁ దడిసినధరణి యిద్ది:
కాకతీయనృపాలఖడ్గధారల శత్రు
పంకముల్ విరిసినవసుధ యిద్ది:
విద్యానగరరాజవీరులశౌర్యోష్మ
రిపువనుల్ వొలిసిన పృథివియిద్ది:

గీ. సంస్కృతాంధ్రకవీంద్రులసరసకావ్య
వాహినులచేవ గొన్నట్టివసుధ యిద్ది:
సకలకకుబంతరాళవిక్రాంత మైన
మనతెలంగాణమహిమ సామాన్య మౌనె?



ప్రొ త్యా ష.

చ. పరిణతచిత్తమున్ గలిగి, పారము లేనికృపారసంబునన్
బరఁగి, యమాయకత్వగుణపావను లై, పొరుగింటివారిమే
లరయుచు, నాత్మలో నతిథియర్చయె పెన్నిధిగాఁ దలంచుస
చ్చరితుల నీసుపుత్రుల విశాలదృశాయతిఁ బ్రోవు మమ్మరో !

ఉ. రాజున కైనఁగాని కవిరాజునకున్ బుధరాజుకున్ పరి
వ్రాజకరాజుకున్ జననిపాదసపర్యను పూర్వజన్మవి
భ్రాజదనేకపుణ్యపరిపాకముచే లభియించుఁ గాదె! త
త్పూజ లొనర్చి సర్వజనపూజ్యుఁడ వై విలసిల్లు మాంధ్రుడా !

చ. కవికులకోకిలాళి సహకారము లేక కడిందిఁ గుంది మా
ధవసహకారమున్ గని కృతార్థతఁ గావ్యకుహూరుతంబులన్
జెవిచవిఁ గూర్చుచుండ బుధశేఖరులార తెలుంగుశారదన్
దవిలి భజింపుఁ డయ్యా! ప్రమదంబునఁ గావ్యసుమవ్రజాంజలిన్,

శా. నిష్ణాతృత్వము శబ్దతంత్రమున నిర్నిద్రప్రభావాతిరో
చిష్ణుత్వంబును గావ్యమార్గమున నిస్సీమంబుగాఁ గన్న భ్రా
జిష్ణుల్ పండితసత్కవుల్ గల సభాక్షేత్రంబులన్ గూర్చి వ
ర్ధిష్ణుల్ సోదరులార ! మీరు దృఢభక్తిన్ గొల్వుఁడీ ! శారదన్.

క. ఒకజాతి కొక్కనాలుక,
యొకహృదయం, బొక్కపూన్కి, యొకవిద్యయె నీ
యకలంకకృపాదృష్టిని
సకలాశాయశముఁ గూర్చి సాఁకుము తల్లీ !

మ. జయముల్ గూర్చుచుఁ దెల్గుతల్లికి; మహోత్సాహంబుతో సోదరుల్
క్రియ రెల్లన్ సమకూర్చుచున్; సుకవిరాట్కీర్తుల్ దిగంతంబులం
"జయజై" యంచు నుతించుచున్ నిలుపుఁడీ! సౌభ్రాత్రసంపన్నులై
ప్రియ మొప్పారఁగ నాంధ్రభారతికి నర్పింపఁగా బ్రసూనాంజలుల్.

క. రాజోత్తములకు, సత్కవి
రాజోత్తములకును, విబుధరాజవరులకున్
భ్రాజిత జననీభారతి
పూజకులకు నెల్ల నిండు పూజాకుసుముల్.

గీ. ఆరబిందుతారకముగ నలరి మమ్ము
నాంధ్రసంస్కృతి జగమున నలముకొనుచు
మహితసంస్కృతులన్ దలమానికంబు
గాఁగ వెలుఁగెడునట్టులు గనుము తల్లి!

కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

# సృష్టి

ఇది మహాంబుధి; ఇందులోపల
ఉదయమయ్యె; ఊర్మికలకూ
మొదలెఱుంగము; తుదియెఱుంగము
యెన్ని యుల్లోలంబులో
ఇక ముందుబుట్టె
వెట్టి కల్లోలంబులో ?

ఈ మహోర్మ్మల నెవడు లెక్కిడు
ఈ మహాంబుధి నెవ్వడీదును
యే మహాత్ముండెఱుగ గలడిం
దే తుఫానులు బుట్టునో
మిన్నొఱయబొంగి
యేమిటిని పడగొట్టునో ?

ఏ సురాసుర లీయనంత మ
హా సముద్రము నాసపెంపున
యే సరణి మథియింతురో యిం
దేమి యమృతము బుట్టునో
ప్రళయంకరంబగు
నెట్టిగరళం బుట్టునో ?

ఇందు శుక్తిక లెన్నియున్నవొ
ఇందు శైలము లెన్నియున్నవొ
ఎందఱుద్ధతు లిది గ్రహింపగ
ఎంత యత్నము జేసిరో
ఫలమొంచకుండా
ఎన్ని మేనులు బాసిరో ?

ఎన్ని జంతువు లిందు బుట్టెనొ
యెన్ని జీవము లిందు గిట్టెనొ
యెన్ని తడవలు; ఎన్ని పడవలు
ఈ మహాంబుధి మునిగెనో
ఇంక ముందుముందూ
ఎన్ని మున్గగ నున్నవో?

గార్లపాటి రాఘవరెడ్డి

# సంక్రాంతి

చిరుతల కనువుగ చిందులు ద్రొక్కుచు
పాటలు పాడుచు పరుగులు పెడుతూ
దాసరివచ్చి ఛెంగున వ్రాలాడూ
వేసము చూడా వేగము రారండి !

భవునేత్ర విగతానల జ్వాలలు లా
క్రూరాహి ముఖగత జిహ్వాలులా
భుగభుగ మండే భోగిమంటలివి
శుభముల గూర్పగ గొలుతము రారండి!

ప్రతిభులు పన్నిన దొడ్డవ్యూహంలా
పండుగ కన్నియ వపుర్లతలులా
వన్నెల వంపుల రంగవల్లులివి
కన్నుల పండువు నందగ రారండి !

వ్యూహములోపలి వీరశ్రేణులులా
కృతులలోపలి అక్షరపంక్తులులా
బారులుదీర్చిన గొబ్బి దేవర్లివి
భక్తితో కొలుతము బిరబిర రారండి!

పంటలొండొంటి పల్కరించు కో
వెంటనంటి నడయాడునట్లుగా
పరువముగూర్చే 'పాలవెల్లి' యిది
మురిపెముదీరా చూతము రారండీ !

చిరునవ్వు పాలబుగ్గలన్ దొరలాడ
నునుసిగ్గు కనుదోయి దోబూచులాడ
కన్నెపడతులా వెన్నజీవితాల్
పున్నెము వడయా దీవింతము రారండి

# శా ర ద

ఆంధ్ర శారదనీకు అక్షరాంజలులూ
అందుకో ఆదుకో రావమ్మ మాయమ్మ!

తరతరాల్ మాయింట తాండవించితి వంట
తలపు తరగలవెల్లి తళుకు బెళుకులతల్లి!
తెలుగు నేలలపైన తేనె మాగాణీ నీ
తీరుగా తేటగా తీర్చి దిద్దినతల్లి!
పదకవితా సుదతికి మధురగాన ఫణుతులఙ
ముదముతో ముద్దుగా చదువ నేర్పినతల్లి!
ప్రబంధ సుందరీ రసబంధుర భంగిమలూ
ప్రభలతో ప్రబలగా ప్రబోధించిన తల్లి!
నవకవితా యువతీ భావాభినయ గతులు
శివములౌ లీలలన్ హావణించిన తల్లి!
ప్రణయ రాగములోన ప్రణవ నాదమునింపి
ప్రవిమలయోగ నియతి ప్రసాదించెడి తల్లి! ॥ఆంధ్ర॥

పిల్లలమఱ్ఱి హనుమంతరావు

# అడుగుజాడలు

కాంచి కాంచిన కనులు
కనుమేర దాటంగ
కనుపాపలను తెప్ప
కబళించి వేసింది.
కలలుగానివిగాధలూ
చెలియరో
కాలమ్ములో గల్పెనే.

లోకాల హింసల్లో
లొంగి లొంగిపోయి
ఆలోకనముకైన
ఆరాటపడ తుదికి
అదియు కరువైపోయెనే
సఖియరో
ఆర్తి నేరికి దెల్పనే ?

సిగలో పూఫైడి తేనే
సిరులొల్కు చూపుల్ల
నాకంట బడకున్న
నిలుపవే కా లొకట
అడుగుజాడలె మిగిలెనే
నారాణి !
అడవిబ్రతుకై పోయెనే.

అడ్లూరి అయోధ్యరామయ్య

# పువ్వా!

వాసంతవీధుల్లొ వయ్యార మొలికించి
పైరగాలుల్లోన పారవశ్యముజేసి
వడగాడ్పులకు నీవు వాడిపొయ్యావా ?
పువ్వా ! వాడిపొయ్యావా ?

సూర్యుడే దండెత్తి చుట్టివేసేవేళ
ఆకాశమందుండి అగ్ని గురియుచునుండ
మండుటెండల కీవు మాడిపొయ్యావా ?
పువ్వా ! మాడిపొయ్యావా ?

కాళరాత్రుల్లోన కాఱుమబ్బులక్రింద
ఉఱుము మెరుములమధ్య ఉక్కిరీబిక్కిరై
ప్రళయవర్షానికే రాలిపొయ్యావా ?
పువ్వా ! రాలిపొయ్యావా ?

ప్రీతిమాలికవయ్యి నాతిచేతులగుండ
నాథుమెడలో వెలసి నాట్యాలు తెగజేసి
నవ్యజంటలమధ్య నలిగిపొయ్యావా
పువ్వా ! నలిగిపొయ్యావా ?

బలివెట్టగా నిన్ను బలవంతముగ కోసి
స్వార్థమానవులంత స్వామిపూజలు సేయ
దేహమే యర్పించి ధన్యవయ్యావా
పువ్వా ! ధన్యవయ్యావా ?

శవముమెడలో నీవు శిశువుచేతిలో నీవు
వధువుతలలో నీవు వరునిహృదిపై నీవు
పరుల కష్టసుఖాలు పంచుకొన్నావా ?
పువ్వా ! పంచుకొన్నావా ?

# చందమామ

ఎన్నాళ్లకొచ్చావు ఓ చందమామా
ఎక్కడా దాగావు నా చిన్నిమామా !

చీకట్లు నినుజూచి సిగ్గుజెందాయి
చక్ర వాకాలన్ని చెలరేగినాయి.

నల్ల కలువలపూలు కళ్ళార వికసించె
మల్లె 'రాతిరి రాణి' పరిమళం ప్రసరించె

అద్దంలో మా చిట్టి ఆడుకొను నీతో
ముద్దుగా పల్కును ముచ్చట్లు నీతో

నీ ఇల్లు వాకిలీ ఎక్కడున్నాదీ
నీ తల్లిదండ్రెవరు చెప్పవే మామా ?

పిల్ల తల్లులు నిన్ను పిల్చినా ఎప్పుడూ
పారిపోతుంటావు నా దొంగమామా !!

మూటుపురి వెంకటేశ్వరరావు

# గౌరి

పున్నెములందు సద్రచనబొందిన యీ పరమ వ్రతంబులో
బన్నిన కంకణమ్ము కర పంకజమందలరార భక్తి సం
పన్నత నారితేరిన యుమాసమలన్ పదమంటి మ్రొక్కన
య్యన్నులమిన్న లాడెడు ప్రియంబులు చెల్లియ నిన్నునోముతన్.

ఎవ్వరు నేర్పిరే చెలియ యీ గతి వాయనమిచ్చి పల్కనీ
నవ్విన నవ్వులో తెనుగు నాటి మనోహరకీర్తి వల్లికల్
పువ్వులు పూచెనమ్మ నరపుంగవుడౌ పతి నెమ్మనంబులో
గ్రువ్విన భావముల్ వెలికి గూర్చినవే నునుసిగ్గు దొంతరల్;

కొసల మరల్చివేసినది క్రొమ్ముడి నూతన ధూప సౌరభ
ప్రసర సువాసితమ్మునయి వ్రాలెను వెన్నునునంటి దీర్ఘమై
ప్రసవచయమ్మునందు పరిభాగమునందెటు నిల్పితమ్మ! యీ
పస విదులించుకొన్న పతిభాగ్యము నేమని ప్రస్తుతించెదన్.

ఆచారమ్ము లలంకృతమ్ములు; స్తుతివ్యాపారముల్ నేటివా
ప్రాచీనంబులు నిండికొన్నవి సమారబ్ధ వ్రతంబందు నో
హో చైతన్య కళాస్వరూపిణీ! త్రిలింగోర్వీ సుమారామముల్
చూచెన్గా మధురాననేందు మధు సంపూర్ణ ప్రవాహంబునన్.

సోమరాజు ఇందుమతీదేవి

# హి తో క్తి

పువ్వులపైని నిప్పులను బోయుటకేనియు. మల్లెతీవకున్
గ్రొవ్విన కాఱుదున్న జతగూర్చుటకేనియు గున్నమావులన్
మవ్వము దూలిపో సెగల మాడ్చుటకేనియు సాహసించి యీ
పువ్వులతోటనే నఱుకఁబూనిరి కొందఱు మూఢ మానవుల్.

ఒక సీతమ్మను దాకు పాపము. జటాయు క్రోధమై, వానర
ప్రకరంబై హనుమన్నిదాఘ దహనజ్వాలాళియై, రాము సా
యకమై కూల్చె సమూలఘాతముగ దేవారాతిఁ బౌలస్త్యునే
డొకటీ రెండునుగాపు స్త్రీలకగు నాయుర్మానభంగ క్రియల్.

పాలబుగ్గల శిశువ్రాతంబు మంటల
బడి 'చుంయి' మనికాలు నెడరుపాటు,
కాళ్ళపారాణి బుగ్గల కాటుకయు మాయ
నవదంపతులు కత్తి నఱుకబడుట,
పూచిన తీవియబోలు ముత్తయిదువన్
సిగబట్టి యీడ్చు దుండగులదాడి,
కాటికి కాల్సాచి కదలని ముదివగ్గు
మంట మూటగపైవ మడిసిచనుట,

యనెడి ఘోరాతిఘోర కృత్యంబులెల్ల
ప్రజల స్వాతంత్ర్యలాభ సంపదనెపాన
న్యాయమెుల్లని మతమహోన్మాదచిత్తు
లేకధాటిగ సలిపినవేగదయ్య !

నవఖాళీ రుధిరస్రవంతులకుఁ జింతన్ గ్రుగ్గి, పంజాబు ఘో
ర విపత్తుల్ భరియింపలేక, వివిధప్రాంతోగ్ర సంఘర్షణల్
చెవులన్ జీములుగట్ట, దుండగులకాశ్మీరోగ్రధాటిన్ పరా
భవశంకన్ బడు భారతావనిఁ దలంపన్ గుండె నీరయ్యెడిన్.

ఎన్నో ఘోరము లెన్నొకష్టములతో నీనాడు స్వాతంత్ర్య సం
పన్నంబైనది భారతంబు; మరలన్ బ్రత్యగ్ర సిద్ధాంతముల్,
సన్నాహంబులు, భావభేదములు, స్వేచ్ఛావృత్తు, లుద్రేకముల్
పన్నాగంబులురేపి శాంతిసుఖముల్ భంజింపకోయీ! సఖా!

నాగలితోడిదే జగమనం గృషిసల్పెడు రైతుబిడ్డలున్
భోగములెట్టివో ! మధురభోజనమెట్టిదొ ! కానకున్న యా
త్యాగులు కార్మికుల్ చెడుగుదారులబట్టి నశించిపోవ నే
వో! గునిపూడిజంగముల యూహలుపన్నకుమోయి! మిత్రమా!

కేశవపంతుల నరసింహశాస్త్రి

# తెనుగు తల్లి

సీ. పరిపూర్ణ పావనాంభస్తరంగోద్వేగ
గౌతమి గంభీర గమనమునకు;
ఆలంపురీ నందనారామ విభ్రాజి
మల్లోబఫలరాజ మధురరుచికి;
ఆంధ్రీ కుమారీ సమాయుక్త సరిస్నాత
తుంగా పయస్సు మాహాత్మ్య మునకు;
ఖండశర్కర, జాతి, ఖర్జూర, గోక్షీర,
ద్రాక్షాదియుత రామరస మునకును;

అమృత నిష్యందిపల్లకీ హ్లాదమునకు;
రాగిణీ దివ్యసమ్మోహ రాగమునకు;
తేనెతేటల నవకంపు సోనలకును;
సాటియగును మాతెనుగు భాషామతల్లి.

# మిత్రుడా!

కొండవీటిని కోటలమరిచి
దండివీరులు తాండవింపగ
చండవీర్యము నిండియుండిన
తెనుగుభూమిది మిత్రుడా!

శాయనార్యుని సాకిపెంచిన
ధీయుతుండగు తిమ్మరుసువును
బాయకుండగ ప్రబలజేసిన
తెనుగుభూమిది మిత్రుడా!

నవరసమ్ముల నాదమొప్పగ
చెవులుసోకగ కవనమల్లిన
కవులుముగ్గురు కల్గియుండిన
తెనుగుభూమిది మిత్రుడా !

వేమనార్యు వివేకమహిమను
సోమనాథుని సూక్తియుక్తిని
[illegible]
గన్నభూమిది మిత్రుడా !

చక్రమండలి ధైర్యపటిమయు
నుత్తరాంధ్రుల యుచితచర్యలు
నుత్తమంబుగ నొప్పియుండెడు
తెనుగుభూమిది మిత్రుడా !

ఆయుధంబుల ఛాయఎరిగిన
కాయబలమున గడలుగెలిచిన
వేయివిధముల పేరుబొందిన
యాంధ్రయోధుల బొగడుమా !

తేటమాటల తేనెలొలకుచు
పాటవంబున బరుషమొప్పుచు
సాటిబాసల నీటుమీరెడు
నాంధ్రభాషను బొగడుమా.

సురవరము ప్రతాపరెడ్డి

# తెనుగుతోట

తెలుగు తోటలలోన - తెలుగు వన్నెలు లేవు
శోభనిచ్చే దెన్నడో ?
తోటంత
సొగసు గులికే దెన్నడో ?

అల్లు పందిరిలోన - ఆటలాడెడు తీవె
పడగ లెత్తే దెన్నడో ?
తోటంత
పైకి ప్రాకే దెన్నడో ?

అందాలు జిలుకుచు - ఆకుమరుగున జేరి
మొగ్గ తొడిగే దెన్నడో ?
తోటంత
సిగ్గు జిలుకే దెన్నడో ?

పసరు తీవెలలోన - పసిడి పిందెలుపడి
పండ్లు పండే దెన్నడో ?
తోటంత
పరువు కాచ్చే దెన్నడో ?

గాలి తాకుడులకు - కదలి ఉయ్యాలలూగి
జోల బాడే దెన్నడో ?
తోటంత
సొంపు లొలికే దెన్నడో ?

పూవుపూవున దిరిగి - పూల మధువును త్రావి
తెట్టెపెట్టే దెన్నడో
తేటుల్లు
తేనె గూర్చే దెన్నడో?

లేమావి కొమ్మతో - లేత యిగురాకు దిని
కంఠ మెత్తే దెన్నడో?
కోయిలల్
గాన మొసగే దెన్నడో?

వానంటి పక్షియు - వర్షఋతువును బిల్వ
కోక గట్టే దెన్నడో?
తూనికల్
గూడి ఎగిరే దెన్నడో?

తోటమాలి అమినులకు - తోటకాపరివాడు
పాదు త్రవ్వే దెన్నడో?
ఎదువుల్లు
పారజల్లే దెన్నడో?

వెలుగు రోజులలోన - తెలుగు పన్నెలు దేప్ప
తేజ మొచ్చే దెన్నడో?
తోటంత
తెగబారే దెన్నడో?

సిరిప్రగడ రాధాకృష్ణరావు

# ఆంధ్రభారతి

సీ. శబ్దశాసనుఁడు వాగ్ధరిమంత్రము పఠించి
నిన్ను ప్రతిష్ఠించె నియతిచేత
ఆవాహనంబొట సర్ఘ్యపాద్యములిచ్చి
తిక్కన కవివంతు దీర్చుకొనియె
కనకాభిషేకభాగ్యముఁ బొందఁగల్గితి
కవిసార్వభౌము సాంగత్యగరిమ
వగు నలంక్రియల దిగ్గంతి యూథముదన్నె
అవధానులెల్ల ధూపాదులొసగ

గీ. నవ్యసాహిత్యకవు లర్చనలనుదస్పు
కోకిలలు మంత్రపుష్పముల్ గురియుచుండ
నాటి రాష్ట్రాలు మంగళాక్షతలుజల్ల
నలుప భాషావధూటి యంజలి ఘటింతు:

సుఫలవెపజలు ఓష్ఠప్రసూనకలిత
శ్రుతులు వెలయించు వీణావిశుద్ధహస్త
సుమములను బంచిపెట్టు మంజుల లతాంగి
ఆంధ్రభారతి! సతము నిన్నాశ్రయింతు.

పుప్పూరు రాఘవాచార్యులు

★ సి॥ ఫాల్గుణ

# ఎందులకో

నందన వీధికలందు
చందన వాయువులందు
నందింపను; నవసౌరభ
మందించును; ఎవ్వరికో ?
ఎవ్వరికో ? ఎందులకో ?
ఎందులకో నా హృదయం ?

వెన్నెల క్రొన్నెల యగుచు
చిన్నని కిన్నెర యగుచు
చిలికించును సుధానిధిని;
పలికించును నభో ధునిని;
ఎవ్వరికై ? ఎందులకై ?
ఎందులకో నా హృదయం ?

భ్రమరీ వ్యాధూత సుమిత
రమణీయ నికుంజ శోభ
గమనించుచు గమనించుచు
గమకించును విషాద గీతి;
ప్రవహించును బాష్పరీతి;
ఏ యెడకో ? ఏ కడకో ?
ఎందులకో నా హృదయం ?

ఏ తరుణీ దరహాసం
ఈ సుమసుమ్మ వికాసం
ఒలికిన వలపులతోనే
మనిపట్టిన ఆశయాల నేల
రుస రుస లాడించు ?

# మధుర పథము

కన్నులరమోడ్చి కమ్మని కంఠమె త్త
సుందరోహాకరం బితాసంద గగన
యూసములలోన మోహన గానములను
ఆలపింతమురమ్మ- నాయందు నీవొ
ఏనొ నీయందు లీనమై ఏకరీతి:

ఏమి తపమాచరించితినో మనోహ
రాంగి ! భవదీయ కలపరిష్వంగమునకు
మారిపోవుదు,నను నేనె మరచి నీదు
లలిత పరివాది నీ సుధామల తరంగ
ఝురులలోని తుషారమంజరులలోన
తేలిపోవుచు తన్మయ తీరములకు.

వ్రాయుదంతట నీ కపోలాలపైన
ముద్దులొలికెడి చిరునవ్వు మొగ్గనగుచు;
తాండవింతును నీ యురస్థలమునందు
తావి వెదజల్లు విరజాజి దండనగుచు:

నూత్నసంపుల్ల మన్మనోంబుజదళా వ్త
రముల నానందమధుర మరందమీవు
మాధురీభావ సురభి సంపదవు నీవు:
స్వాంత మేనీవు జీవిత స్వాదుసరసి
కలసుధాపూర మీవు నాగానమీవు.

నీదు కడగంటిచూపు వెన్నెలలతోడ
ఈయమేయప్రసన్న విహాయసంపు
సరళ వీధులలో మనశ్చంద్రు డిటులె
పెరిగిపోనిమ్ము చిన్ముద్ర కరణినింక
రథమునడిపించు ఆక్షీర పథములందు.

# స్వప్న సుందరి

కాటుకనీలిరేకల నిగారపుకార్గిలను చూపుతోడ స
య్యాటలనాడు లేనగవుటందపుమోకల నేలనాహృదిన్
మీటెదు చిన్నికిన్నెరను మీటినరీతి మనోహరీ? ఎటో
దాటిననాటి స్వాప్నిక కథాగతులన్ బలికింపబోకుమా!

కన్నులుమూసిలోనగనగా కనుపించు స్మితించు నీదు దీ
వ్యన్నవమూర్తి నాహృదయ పద్మమునన్ వరపద్మయై, రసా
భ్యున్నత భావడోలికల నూగుచునూగుచు దేలిపోవ. నా
కన్నులు విచ్చిహెచ్చ తమకంబున అశ్రులురాలుజాలుగా

దూరపుమేరదోచియును తోచనిఆయుచలాగ్రమందు, మం
దారపుతోటవాకిట సదా ప్రవహించు ఝరీమృదూర్మి మా
లారవమేళితస్వర కరస్థవినోద విపంచివై, లయ
స్ఫారమనోజ్ఞగీతికలు పాడెదవే ఎదవేగిపోవగన్.

ఆడెదవొక్కసారి నభమందున జక్కదనాలచుక్కవై
పాడెదవేదియో హృదయభారముడిగ్గ అమర్త్యకన్యలన్
గూడిచరింతునందనము కోనలబూవుల సోనలందు దూ
గాడుచు నింపుకొందువు మనంబున మోద నిలింపసంపదల్.

తొలిరేవెన్నెల పాలకోనెరున ము
ద్దుల్ మీర నీ వేనునున్
జలకంబాడిననాటిమై పులక లిం
కన్ దోచు క్రొంగ్రొత్తలై.
తొలగంబోవదు ఆరమా ప్రతిమ క
న్దోయిన్ దిగన్ జారు కా
ల్వలలోనన్ బ్రతిబింబితంబు నగుచున్
లాలించెడిన్ డెందమున్.

కలయైపోయిననాటి జీవితసుధా
కాంక్షా ప్రపంచంబు నం
దలి యందాల గులాబిపూబొదలు, మం
దానంచి వాయూర్మికల్,

పలపుంగావి పసందు సంజలును, లీ
లాపేశు సందావముల్
తిలపోయన్ ఒకచిత్ర చిత్రితములై
తాకున్ మనోదృష్టికిన్.

వినవచ్చున్ మృదురీతి. నిర్ఝరవనీ
విద్యాధరీ కిన్నరా
క్వణనంబుల్, కనవచ్చు త్రుళ్ళిపడు గం
గాతరంగమూర్మి ప్రఖే
ళన హేలానవదోలలన్ గదలు చం
ద్రస్మేర మందారముల్
కనులన్ మూసిగతాను ధూతుల సమీ
క్షల్ సేయనొక్కొక్కచో.

కాటుకచీకటిం బొగలు
గ్రక్కుఘనాఘన పంక్తులందు నీ
వేటికి దూరినావు - తపి
యింతువు - తీరని విప్రయోగ దుః
ఖాటవులందు గ్రుందు హృద
యంబువలెన్ - శమియింపమేని ఆ
రాటమునాదు బాష్పఝరు
లన్ జలకంబులు ఆడిపోగదే.

సిరిప్రగడ భార్గవరావు

# నీ రాక

నీవురావాలన్న మమతే
నీవువస్తావన్న మురుపై
బ్రతుకు కిన్నెరభావ మూర్ఛన
లోలికి పోయినదీ.

నీవువస్తావన్న మురుపున
నీవెవరవో పోల్చుకుంటూ
జీవతూలిక తీవవెన్నెల
సొంపు లొంపినదీ.

నీవురావాలన్న వలపే
తలపుతేనియ భరముమోస్తూ
విరహగేయ దివ్యప్రసూనా
వళుల నల్లినదీ.

నీవెవచ్చేవన్న మురుపున
బ్రతుకుతమ్మినియాసముత్తెము
లోలికి నిలువున నుబుకుతూ న
ర్తిల్లి పోయినవీ.

ఊరికావలి మావి తోపున
దారిగాచిన పిల్లకోయిల
నిన్నుపోల్చుకు "మేలుకొ"మ్మని
యీల వేసినదీ;

వీధి పందిట కన్నె పుల్లియ
"వచ్చెలే !
వంటలు పండె లె!"మ్మని చిలిపిపాటున
కన్ను గిలికినదీ;

సందడిలొ సందడిగ యళివర
మాడుచూ పాడుచు ముగ్ధ –
ప్రణయి నూరార్చుచూ మోవిని
అంటిపోయినదీ.

... ... ...

రాకలో రంగిలిన నే నీ
రాకలోనే మైమరుస్తే
సేకరించిన సొంపు సంపద
నీ కొనర్చె దెవ్వరో ! !

జమ్మలమడక సూర్య ప్రకాశరావు

# మాయ

ఇదియేమొ యెవ్వరైన నెరుగంగజేయరా ?
ఇటులున్న నా బాధ నెటులైన బాపరా ?

దీని నీడలు నిండు దిశదిశాంతములందు
అన్ని యెల్లలుదాటి యంతటన్ బ్రసరించు;
ఆ నీడ ఛాయలన్ విశ్వమంతయుగూడ
ఒకరీతి మదితోచు నొకరీతి కనుపించు ||ఇది||

ఔనన్నవాటిని అద్దికాదని చెప్పు
కాదన్నవాటిని కనుపింపజేయును;
ఒకసారి నొకదాని నొకరీతి జూపించు
మరుసారి దానినే మార్చి జూపించును ||ఇది||

కనుల గ్రమ్మినవేమొ కారుచీకటులల్ల
కనుపింపదేమియు, కనలేను నిజమును;
ఏమున్నదీ వెనుక నేమున్నదోయీ ?
తెలియజాలక నేను విలపించుచుంటి.

ఇదియేమొ యెవ్వరైన నెరుగంగజేయరా ?
ఇటులున్న నా బాధ నెటులైన బాపరా ?

సన్నిధానం శ్రీధరశర్మ

# ఆయాది

ఆయాది నాకిపుడు హాలాహలంబయ్యె
లోకమే చీకటిలో లోపించె నాకు
శోకమే నలుదిశల శ్రుతియించెనాకు!

నన్ను నే చూసుకొని నిన్నె తలచుకొని
నిన్ను చూసినచాలు అన్నీ మరచిపోయి
‘నీవు నాతోవుంటె చావులేద’నుయాది ||ఆ||

రసవాహినులుపారు గుసగుసల యాది
కొసరి కొసరీ నవ్వు విసరు పువ్వుల యాది
రాగనిభృతమైన త్యాగాల యాది ||ఆ||

వాల్చూపు జాలులో పోల్చుకోలేనట్టి
కన్గోన లందూరు కమ్మనీ మధువులు
కాలాహి విషయమునే కరగించు యాది ||ఆ||

మల్లెపందిరిక్రింద నీవల్లి వేసిన ప్రేమ
పిల్లకాల్వల కెలన నే కొల్లగొట్టిన ప్రేమ
దేవాలయంబులో దీక్షబూనిన యాది ||ఆ||

అద్దములో మన ప్రతిమ లాడుకొను యాది
నిద్దురోయినగాని వద్దన్నగాని
ముద్దులొలికిన ప్రేమ యుద్ధాల యాది ||ఆ||

ఆయాది నాకిపుడు హాలాహలంబయ్యె
లోకమే చీకటిలో లోపించె నాకు
శోకమే నలుదిశల శ్రుతియించెనాకు!

బూర్గుల రంగనాథరావు

# భానురథము

ఉదయంబందున భాస్కరా! కరసహస్రోన్మేషముప్పొంగ నీ
సదయాకారము గాంచ వేడ్క సరసీజాతంబులుఙ్ మానవుల్
నదులుం బర్వతముల్ నభంబు భువియుఙ్ నానా మహాజీవులుఙ్
ఎదురుంజూపుల జూచుచుంద్రు, ప్రభురాకఙ్ వేచు సభ్యుల్ బలెఙ్.

కాలుడు మాయయంచు బుధగణ్యత నొందెడు సాలెదంపతుల్
మూలములేని యాకసపుమోలల మగ్గమువైచి చిత్రమౌ
కాలపు తెల్లతాను కడకమ్ములు లేకయనేయనేయమే
మోలిని దానిగొల్చికొన నొప్పును సూర్యుడు మూరబద్దయై!

ముసలి యెద్దుసులేపి వెసపాగ సవరించి
కణ్ణుపై చేయిడి కర్షకుండు;
పెంటితో ప్రియమాడి పిల్లలముద్దాడి
మేతల కరుగంగ పోతుపక్షి;
'ఇంతయే ప్రాప్తిబోలీ నాటి' కంచును
తడబడి పరువెత్తు తస్కరుండు;
ఉద్యంత మంత్రంబు నుచ్చరించుచు
నర్ఘ్య మర్పింప నిల్చిన యాహితాగ్ని;

ప్రియుని కౌగిలివిడలేక బిడియపడుచు
నత్తవారింట మెలగెడి క్రొత్తపడుచు

ఆలకింతురు చెవియొగ్గ యలతియలతి
బంధురధ్వానమునవచ్చు భానురథము.

స్వామి ! పల్వురు శిష్యవర్గముల కాచార్యుండవై నీవు ఛం
దో మీమాంసలఁ సల్పుచుందువటగా ఓంకారముల్ సల్పి వా
రే మోవించు ధగింత్రు విద్యలను నేడీ ప్రాక్తనాచారముల్
సామర్థ్యంబులుసున్న, చాక్షుషములై శాస్త్రంబులున్ జెల్లెడిన్॥

ఆముదమా ఖరీదు; చమురా చమురాయెను; సీమనూనియల్
ఖాపల ప్రొయ్యిమంటలకు పట్టెడునంతయు లేవు, వహ్నులన్
డాముసు చప్పచల్లవడె దారుదరిద్రత జెంది, వైద్యుతం
బామును పంతకోతవడె నక్కట దీపము లోపమయ్యెనే ;

లో వెలుగెన్నడో మనుజలోకపు టంచుల లుప్తమయ్యె. పై
పైవెలుగైన చీకటుల బంధురతాండవ మద్దగించునం
చీవర కూరడిల్ల గలయించెను గొంతెమ కోర్కెయై, మను
ష్యావళి బాహిరంబునను ఆంతరమందున గ్రుడ్డియౌనటే?

మానవు దర్థనిర్మితిని మ్రాన్పడజేయును విశ్వకర్మనిన్
ధీనుత సంపదన్ గెలుచు దేవ పురోహితుగూడనైన శా
పానుగుడైనయట్లు కలియంతయు నేలకు వమ్ముసేసి తా
దీనత నాకటంబడునె, దీపముకైనను నోచుడాకోకో ?

అదుగో వార్ధపురీ కుటీరమున
భవ్యంబైన తేజంబు; అ
య్యది కార్చిచ్చునుకాదు,
మందకొడి చంద్రాంశు ప్రభల్ కావు, కా
ల్వదుముట్టంజన,
జ్ఞానతీక్ష్ణమగు నార్పంజూచునా దివ్వియః
పదివేల్ హస్తములారునే
హృదయ దివ్యస్నేహ దీపావళుల్?

నాకేకావలె, నేనయేలుదను పంతంబుల్
వృథాలాపముల్;
నాకింతైననుజాలు,
నామిగులులో నా సోదరా నీవునుః
స్వీకారంబులు సల్పుపయ్య:
ఘనమా జీవంబు స్వార్థంబుకై
ఘాకల్యాణములొక్కచేత నగునే
పొందైన మేల్కాదొకో?

ఖండవల్లి లక్ష్మీరంజనం

# సంక్రాంతి

చిగురు చెక్కిళ్ల ముంగురుల్పిక్కవడగ
మొల్లచిఱు నవ్వుమోమున మొగ్గదొడుగ
అగరు తిలకంబు బొమ్మల నందగింప
చిలుక పల్కులు పలికెను చిన్నిచెల్లె,

"అన్న యెక్కడి కేగెదు? నన్నుజూడ
సకియ సంక్రాంతి వచ్చెడు సమయమయ్యె:
క్రొత్త బొమ్మలు నీవివ్వ దెత్తువేని
ఇచ్చెదను నీకు ముద్దుల నెన్నియైన"

... ... ...

బాల సంక్రాంతి తోడుత మేలమాడి
వత్సరంబయ్యె: నెచ్చెలి వచ్చునంట
'ఎప్పుడో యెప్పుడో', యని యెదురు చూచు
ఈడు కన్నియలం గూడి యాడుకొనగ,

... ... ...

కుంకుమంబులు చల్లిగొబ్బి ముద్దలుపెట్ట
పగడాల సొగసును పరిహ సింప
పక్షివ్రాలిన భంగి పసుపు ముగ్గులు దీర్ప
పుష్య రాగంబుల పొలుపు మీర

రంగారు దీర్చిన రంగవల్లిక గుంపు
కన్నె తీగల వోలె వన్నెగుల్క
జడలోని మల్లెలు జారియుండిన చోటు
ముత్యాల సొగసుతో ముచ్చటాడ

చీర కుచ్చిళ్ళు పదముల చిందులాడ
తెనుగు వాకిండ్ల దిరిగెడు తీగబోండ్లు
సరస సల్లాపములు సేయు సమయమందు
పుట్టి నింటికి వచ్చెను పుష్యలక్ష్మి.

కాళ్ళకడియాలు కరముల కంకణాలు
మధుర మధుర స్వనంబుల మాటలాడ
ఆంధ్ర గృహముల గారాపు టాడుబిడ్డ
వనిత సంక్రాంతి యల్లన వచ్చునపుడు.

గంప నెత్తినబెట్టి సొంపుగా జూచుచు
జొన్న చేనున కేగు వన్నెలాడి
కొడవలి చేబూని కులుకుచు గులుకుచు
కాసె గడ్డిని గోయు కాపుకన్నె
పసుపు చీరనుదాల్చి బంతి పూవులమాల
లందంబుగా గ్రుచ్చు సుందరాంగి
కమ్మ సంపగితోట చెమ్మ చెక్కలనాడు
చిన్నారి పొన్నారి చెలుల గుంపు

ఎదురుగానేగి "ముద్దుల వదినె రావె
మేన గోడండ్రు నినుజూడ మిరపతోడ
పొంతకనుపండు వొనరించు పొగడ చెట్ల
విరులు గ్రహియించి తెచ్చెదు వేళయయ్యె"

అనుచు నాహ్వాన మొనరించు నవసరాన
"ఎవరు బిల్చిరె చెల్లెల యెందు కింత
సంబరముజూపు నంక్రాంతి సకియ" యనుచు
తియ్య తీయగ బలికెడు తొయ్యలులును;

"ఏన్నిదిన ములకే తల్లి! నిన్నుజూడ
కనులు వాచెను ర"మ్మంచు కౌగలించి
మధుర ప్రియవాక్యముల నాడుమాన పతులు;
"తరుణ వతియైన మాచిల్క తల్లికిపుడు
పసుపు గుంకుమలంబెట్టి పంపవలయు"
ననుచు వచియించు నాప్తులు నప్తులరుచుండ

— — —

ఇల్లువెనకనె విలసిల్లు మల్లెతోట
విరియ బూచిన పూలతో పేడ్కసేయ
బీరపాదుల కొక్కింత దూరమందు
కొమ్మ చిక్కుడు పందిలి గ్గూరుచుండి
జారుజడ నల్లుకొనుచున్న వారిజాక్షి
లలిత సుకుమారహృదయాన మొలకలెత్తు

తీయతలపుల మనకెట్లు తెలియు గాని
నాతి పెదవుల చిఱునవ్వు నాట్యమాడు
పండుగకు దెచ్చుకొన్నట్టి బెండపూవు
వన్నెచీరను ధరియించి వచ్చుపడతి,
నాగలిని దున్నుచుండిన నాథుకడకు
సద్దిగొను పోవునొక కాపు ముద్దులాడి;

నడుము కొడ్డాణ మొక వింతకడిమి గూర్ప
నిలువు టద్దంబు కెదురుగా నెలతయోర్తు
సగుమొగమ్మున కుంకుమ నద్దు కొనుచు
నోర చూపుల జూచు నొయ్యార మౌర !

వంగ తోటకు వలపట వనితయోర్తు
దోసతీవల పండ్లను గోసి కొనుచు
యేల పాటలు బాడెడు యింపు జూచి
రసిక హృదయాలు సౌందర్య రాజ్యమేలు.

పశుల మందనుగాచెడు బాలుడొకడు
చింతకాయను గోయగా చెట్టునెక్క
కోడె లొకకొన్ని వెంటరా గోగణంబు
జలక మాడగనేగును చెఱువు కడకు;

చిన్నిలేగల యొడల్ చన్నుజేపగ నాకు
చొక్కు-ంపు టావుల చక్క-దనము

పచ్చని పచ్చిక పట్టులఁ బవళించు
ప్రాయంపుటెద్దుల సోయగంబు
రంకెలు వైచుచు రంపిల్లి పోరాడు
కొమ్ముల కోడెల గ్రుమ్ములాట
ఆకుల గుడిసెకు అతి సమీపంబున
లీలగా విహరించు లేగసొరు

అరసి తనకష్ట సుఖముల మరచిపోయి
కందిచేనున నిల్చున్న కాపువాని
కోరమీసాల కొనలందు కోడెవయసు
ముద్దుపడుచుల హృదయముల్ మోహ పెట్టు,

సగము నలిగిన పూవులు సిగనుగుల్క
రణిత కంకణ కింకిణీ రవముతోడ
చల్లజేయుచు నుండెడు గొల్ల పడుచు,
పిన్న తమ్ముడు తొట్టెలో ప్రీతితోడ
ఆడుకొనుచుండ నయిదేండ్ల అక్కయోర్తు
ఉయ్యేలను నూగు చుండెడు యొప్పుజూచి
మంద హాసంబు జేసెడు మాతృదేవి,
కమల కావాస యోగ్యమౌ కనులనుండి
దివ్యవిజ్ఞాన లతికలు తీగెవార
పురుష సూక్తము పఠియించు భూసురుండు,
మకర లక్ష్మికి నెయ్యంపు సకులుగారె?

అంప శయ్యను కొన్నాళ్లు అధివసించి
కన్నులారగ నొకమారు గాంచి నిన్ను
ప్రాణములు వీడదలచె మా బ్రహ్మచారి
ఎంత ధన్యవె చెల్లెలా యింతులందు!

# పూలచెట్లు

చిన్ని బంగారు చేతుల చెంబునెత్తి
ప్రొద్దుపొడుపుతో జనుదెంచి పూలచెట్ల
కిట్లు నీర్వోసి శ్రమియించె దీవుతల్లి
ఎన్ని జన్మాల బంధమో యెవరి కెరుక?

చెట్లమీదనె యుండు నీచిత్త మెపుడు
పూలువాడక ఆకులు రాలకుండ
వరము గోరగమొన్న నీ వరిగితంట
శ్యామలాదేవి ఆలయ సముఖ మునకు!

తలిరు బిడ్డల గాంచిన తల్లికట్లు
ప్రాణములు లేచివచ్చును బాలనీకు;
ముందు పిల్లలతల్లివై మురియు నపుడు
ఎంత ప్రేమించి పోషింతు వేమొవారి!

అన్నమును పెట్టెదంచును అమ్మనిన్ను
పిలిచె ఆకలి వేళయు తెలియ వయితి;
పరహితంబున తన్ను దామరచు టరయ
వెన్నతో నీకుబెట్టిన విద్యయేమొ !

"ఏమొవచియించు చుంటివి యింతసేపు
చాలునిక నీదువాక్యలు చాలు"ననుచు
కిలకిల నునవ్వ దానిమ్మ గింజలచట
రాలెనను భ్రాంతి ఆచిల్క వ్రాలెనేమొ!

దేవులపల్లి రామానుజరావు

# 'నేను'

పీలున్న ప్రతిచోట విర్రవీగుచు అపర
హిట్లరౌతాను నే - హిట్లరౌతాను;
తలదన్ను వానికడ - తలవంచి 'దయ' అనుచు
గాంధి నౌతాను నే - గాంధినౌతాను.

మంది తప్పులనేరి - మనసు ఖాతా నింపి
వడ్డి వడ్డీకట్టి - వల్లించుతాను
నాతప్పులను దాచ- నానారకాలైన
ధర్మసూత్రాలతో - దడికట్టుతాను !

# హృదయావేదన

అవనిపై జరిగేటి
అవకతవకలు జూచి
ఎందుకో నా హృదిని
ఇన్ని ఆవేదనలు ?

తప్పు దిద్దగ లేను;
దారి జూపగలేను;
తప్పుజేసినవారి
దండింపగాలేను;

కష్టపడువారలను
కాపాడగాలేను;

అవనిపై...

పరుల కష్టము జూచి
పగిలిపోవును గుండె
మాయమోసము జూచి
మండిపోవును ఒళ్లు
పతిత మానవు జూచి
చితికిపోవును మనసు

అవనిపై...

... ... ...

అవకతవకలు నేను
సవరింపలేనపుడు,
'పరులకష్టముతోచ
పని యేమి మన' కనెడు
అన్యులనుజూచైన
హాయిగా మనలేను!

అవనిపై...

# ప్రపంచం

గడియగడియకు మారుప్రపంచం
గవ్వకునూ కొరగాని ప్రపంచం!
పొరదోలపై బడెదు ప్రపంచం
కొరగవే కొమ్మెక్కు ప్రపంచం
వలదనగ మెడబడెదు ప్రపంచం
వలచినచో వైదొలగు ప్రపంచం
ఆసపెట్టి ఆడించు ప్రపంచం
మోసపుచ్చి మురిపించు ప్రపంచం
సమరాలకు 'సయ్యో'నెడి ప్రపంచం
'శాంతిశాంతి'యని చాటు ప్రపంచం
వక్రమార్గ వర్తనల ప్రపంచం
సక్రమ బోధల సల్పు ప్రపంచం
నీతిరహితమై నెగడు ప్రపంచం
నీతినియమముల నేర్పు ప్రపంచం
వియ్యాలకు వేంచేయు ప్రపంచం
కయ్యాలకు కాలుదువ్వు ప్రపంచం
నిలువుదోపిడుల నిత్యప్రపంచం
చిలుక పలుకులను పలుకు ప్రపంచం
దయాధర్మముల దండి ప్రపంచం
తడిగుడ్డల మెడగోయు ప్రపంచం॥గడియ॥

# ఆత్మహతం!

మానవుని హృదయంబు
మానవుని
మానవుడు
మానవుని
మాదిరిగ
మన్నించలేనంత మలినమైనాది ॥మా॥

జాతియని
రీతియని
దేసమని
వేసమని
విసముగక్కే వింత
విసగ మారినది — ॥మా॥

ఆధునిక
ఆర్భాట
మందణగి
అవనియే,
ఆత్మహతమై, జనుల
అడవి యయినాది— ॥మా॥

# దీపావళి

అమవస చీకట్ల
నాకాసమునకంపి
మిరుమిట్లు కొల్పేటి
మెరుపుదీపాలు ...
మేడమిద్దెలమీద
మింటిచుక్కలనంట
వేయిరంగుల వెల్గు
వింత దీపాలు....
ఊరివెలుపలనున్న
పూరిగుడిసెలదూరి
లోనిచీకటిబాప
లేనిదీపాలు...
దోచి దాచిన దెంతొ
దుర్భాగ్యులకు జూప
ధనపూజ చేయించు
ధర్మ దీపాలు...
'రక్కసుని చావుచే
రంజిల్లె జగ'మంచు
కోటివెల్గులచాటె
నాటి దీపాలు;
'రక్కసులు బాధింప
రక్షయే లే'దంచు
కోటిరీతుల దెల్పు
నేటి దీపాలు !!

కాకోటి నారాయణరావు

# ఓరుగల్లు కోట

కుక్కలు జింపువిస్తరిగ గూలిన యోగ్గలు కోటగంటివే
ముక్కస ప్రాణముండియును మూతికి మీసముగల్ల నాంధ్రుడా;
ఒక్కకరమ్ము ఫాలమున నుంచెదు 'నాబహుపాప' మంచునో!
చుక్కల చందమామ తలసూపడె తిర్గి ప్రతాపరుద్రుడై !!

తక్కినమాట లేమిటికి? 'తన్నిన వెన్నున చప్పుడామెని
పైక్కడనో' యటంచు వెనుకేనియు జూడని సోమరుల్ నృపుల్
దిక్కయి దీనికింత గతిదెచ్చిరి! కాకతి బెబ్బులుల్ రుషల్
గ్రక్కెడిచోట, గర్జిలెడి గడ్డపుమేకలు గూబమూకలున్ !!

నీళ్ళమేత ముట్టక నందినేల బట్టి
కినిసిపడి యున్నదేటికో తెనుగుబిడ్డ!
ఆంధ్ర సామ్రాజ్య మిచటికి నస్తమించె,
గోవులను బీకికొని తిను ఘోరకాల
మరుగు దెంచుట దలచి, బండగుచుగూలె!!
చెడిన ముఖముల నాక్రొట్టుబడిన యంగముల
నెగయలే వాయీ హంసము? లటుగాక
శిల్పిప్రతిభలయుగయు గాల్జెప్ప గానొ?
చావమోదు దుష్టులచేష్ట సాక్ష్యమిదనొ?
ఆగెమాయాంధ్రి శిల్పుల హంసలనిన
బండలై, పాలు నీరువేర్పరచి చూపు!

ఆంధ్రి సంస్కృతి నిల్వుటద్దమ్ములిడిచూపు
మోముగన్పడ జేయు ముద్దుశిలలు;
దివిముట్టెనీ కాకతీయ సత్కీర్తి నా
దనరు ఇంద్రి సభాది తాండవములు;
కాకతి సామ్రాజ్య కాంత కొడ్డాణమై
కొమరారు నోర్గల్లు కోటగోడ;
తలదాల్చ దగిన దాంధ్రుల శిల్పమనిరాతి
వలచి వచ్చిన పూలు దెలుపు నొకట;

నాటిరామ పొచరజః కణంపు శక్తి
నిజమరియ శిల్పిచేతిలో నిడియెనేమొ!
బడుగు బండలు తాము రంభలను మించు
నప్సరసలయి యిచట నాట్యమ్మొనర్త్రి!

కలకలలాడు లేనగుమొగమ్ముల జీవములొల్క నాట్యముల్
సలిపెడి శిల్పకామినులు జాల్వరుసిగ్గుల నిగ్గులొల్కన
వ్వులునగు చెంతకాలమిటు వొల్తురిదెంతయు వింత! యిట్లుపీ
రలగిలి గింతవెట్టిన కర్మములశిల్పి, యదెంత చిల్పియో!

కాకతీయాది నృపులు, స్వర్గమును మించు
దానినీ భూమినుష్ణ రక్తాల గడిగి.
కుమత శాత్రవచేహేంధనముల మసిని
కావిరిగ దిద్దియుంగ రక్షనిడిరపుడు!

ఓ యేకశిలా నగరమ !
నీయాపూర్వోన్నతిని గణించిన యెడలన్
మాయెడద నిలువు నన్నీ
రేయగు ; నిదికాలవైపరీత్యము గాదే ?

# దుక్కి బక్క

సొడసొడవేడి నెత్తురులు చుక్కలు చుక్కలు గాగరాల
చోసెదుబడె దండపుంపు, మెయిచిల్లుల జల్లెడయయ్యె, నింతకున్ బడలదు,
వాడిపీడదిది పాడియె చూడుము కాపుబిడ్డ !
నీపొడిచెడు ముల్లుకఱ్ఱకెటు బోయెను కన్గవ యింతగ్రుడ్డిదే ! !

సూలము వడంకజొచ్చు నది'హా'యని యూర్చెడి గాలిదెబ్బ,
నాకలమును వెన్కవోవునది గార్చెడి యశ్రునదీహతిం,
కృషీవల యెదురెక్కజొచ్చు గడువాడిని నీములుగఱ్ఱయే ! అహో
తలపగ నాదుప్రాణములు దస్సనుపో ! యిదియెంత గుండెయో ! !

ప్రాణములేని బక్కమెయిపై నిటునెత్తుటి దుక్కిసేసె
నీపాణిని వెగ్గుముగ్గలప, బక్కయొ నెత్తుటి మళ్లయందుఁ దాఁబ్రాఁణి
దయాకృతజ్ఞతలఁ బాయని యోర్పను విత్తనాల నాధానమొనర్చు
నాకనుల దార్కొను నీ రిదుపెంత వానివేన్,

'చెండెదరిట్లు మీరొనను? సేద్యముసేయనొ? చేతగాదు;
నన్‌రెండుగ జీల్చితోలుగొనరే? యిటులంతట గ్రుచ్చ, బొక్కెనన్
తొండపు దోలుకేనితుది త్రొక్కెడు ముచ్చెలకేని పనికిరాకుండుదు'
నంచు చింతనెద నొందుచు నశ్రుల గ్రుమ్మరించునో!

బండెడు బొక్కలం బై వేసికొనియేని
తలవ్రాల్చి బురద నా గలిని దున్నె;
అయినంతవరకు తానా యింత శక్తినేన్
దాచక రక్తమ్ము ధారవోసె;
పడుచు లేచుచును గంపెడు మొసన్దీయుచు
ప్రాణాలతోనె నీపనులు దీర్చె:
ఆగజాలని బాధలతి దారుణపు పోట్లందిని
లేని సత్వము న్దెచ్చికొనియు,
'నాత్మయా! లెమ్మ'టంచు బోరాడుచుండె:
కాయమూ మొండిబారియు కాళ్ళుసాచి
జడమువలెబడె; నవశమై సద్దుకొనియు
'లేతు'నని వేడనోరేని లేకపోయె!!

అది గ్రహింపక నీవుదానిదియె కపటమంచు,
ముక్కులు మూయుచు నట్టెపంటం
దోకం గొఱుకుచా యపుపట్లం దాకం బొడుతు!
నోరుదెఱచేమొ యనబోవు తీరునవది.

# పాదరక్ష

ధూళియించుక బడ దుల్పిపై చెడి నీవు
తానమాడెదు దుబ్బలోన నేడు;
ఎండసోకిన యంత నెంతొ కందెదు నీవు
కౌగిలింతువు నిన్నుగాల్పు ధరను;
చీమగుట్టిన యంత చీకాకు పడు నీవు
ముద్దాడెదవు సూది మొనల నిప్పుడు;
పచ్చిక బయళుల పండ గోరెడి నీవు
ఇండ్లగట్టెడు రాళ్లముండ్ల లోనె

ముందు నితరుల కరములు మొలకవోలె
పెరుగదలచు న్నివిటు కాళ్ళనరగె దెట్లు ?
'నేను నేన'ని యభిమానమూను పశువ !
పాదరక్షవై యిటు చచ్చిపడితి వెట్లు ?

'నేనె సుఖపడ వలెనిలలోన' ననెడి
యపుడొ,వరిము ల్లెనీకు బ్రహ్మాస్త్ర మయ్యె !
జనుల పాదదాస్యము గోరిచనెడి నీకొ
కోతలును గుట్లు అందంపు పేతలయ్యె !!

న్నిన్ను నీవరక్షించుకో నేర్చునపుడొ
మూడు మూళ్లతో నెచటికి మొదలుగాక

పోతి చర్మమా! పరపద పూజయందొ,
చేరెడుండి విశ్వవ్యాప్తి జెందుదీవె !!

అనయములోక సేవను మహత్తర కష్టములేని లీలమై
ఘనసుఖ తుల్యమైతనివి గల్గగ చేయునటంచు కిఱ్ఱుంకి
ట్టను ధ్వని నడ్డడుంగునకు నార్చుచు నాకడ జేరియెంతచె
ప్పినవిననైతివే చెవిటి పేంగలివై శ్రమనొంద ముచ్చెరో!

వితత పురాణమ్మైన ప్ర
కృతి భాగవతమున రతము సేవుచొనరుచుచుఽ
ప్రతి పదమంటియు వెదకెద
వతిగూఢం బైనభగవ దంశమురక్షా!

అరకాల మనైనసంటగానీయక సాకుట నీయందె సార్థపడియె;
ఎపుడు వెంటంగొని యేగగాదగినంత ప్రేమపాత్రంబవైవెలసితీవె;
తొడిగిననే కాలవిడిచిన పంచనే పడియుండుటయును నీకడనెగలదు;
ప్రణయమ్ముతుదియెల్లపాదసంశ్లేషమే యనిచూపుటకునీవు యద్దమగుదు;

వలయునేడ చేతికివ్వచ్చి, ఖలులపైకి
దాడిజను బుద్ధిజెప్పుపాధ్యాయవగుదు
విట్టులెల్ల సంబంధములీవయగుచు
సఖిలజన భారము వహింతు వమ్మరక్ష !

ఒకప్రక్క మాడ్చుకొనుచున్
సకలమ్మునునీకయర్పణము సేయుచు
నిన్నకలంకత సాకినదానికినా
ప్రతికృతము లిట్టినిష్ఠురపు గతుల్!

మూడుపొళ్ల నెత్తురు నీవహాడుజేసుకొని
భుజించితి; వీమిగిలిన రుధిరము,
నీదు ములుగఱ్ఱ వనదంశనికరములకు,
పాడు కాకి గ్రద్దలకుఁ బాల్పంచి యిడుచే!

మునునీయెదకె పాపమనిపించి పాలిన్ని
విడువ నెగాని తాఁగుడిచె నొక్కొ?
అసువులు విలవిలలాడఁ దన్నుకొనుచు
నెద్దు గొట్టగ నిన్ను 'వద్ద'నియెనె?
దయవిచారించి వదలినప్పుడేగాని,
'చేతగాద' నియేని చెప్పెనొక్కొ?
పొట్టనారసి నీవుపెట్టి నంతయె కాని
'నిండలేద' నగ దమ్మెందు నొక్కొ?

ఏమనుదు రైత! దానిదదేమొ. కాని
మొదటి నుండియు కష్టపు బ్రదుకె యబ్బ!
తలచి కొన్నంతఁ బ్రేవులు తఱిగికొనెడి
నేమిసేతు? చేరెడు నీళ్ళకేడ్తు; వింతె.

# బిచ్చగాడు

తెగమాసి పిట్టగూడగు తలంగల చింపి
గొంగడిలో శని గూరుచుండ,
పెరిగి పెన్బ్రూచిమాదిరినున్న మీసగ
డ్డాల కంటుకొని వంటకము మెరయ,
కడుపుమంటకు ద్రావు గంజిచుక్కలు వ్రాలి
పొట్టపై చారికల్ గట్టి వెలయ,
చీరపేల్పడ మాని చిల్లులబడు గోచి
వేనోళ్ళ దైన్యము న్విశదపరుచ,

వెంటబడి పిల్లలో రాళ్ళు విసరుచుండ
కొసరి మ్రొక్కుచు నెగబడు కుక్కదాడి
తద్ద దప్పించికొనుచు చేతనొకచిప్ప
పేలికలు వ్రేల మొలనపైన భిక్షువొకడు,

ఇంటింటి కరగుచున్ 'మీ
బంటుకు బానిసనుగింతబారెయ్యవ్వా
కుంటోన్ని పున్నెముంటది'
అంటయు యే తల్లికిన్ దయలు రావయ్యెగా,

వానమామలై వరదాచార్యులు

# క్షమామూర్తి !

హిమగిరి శిఖాముఖాన వెల్గించి నావు
దివ్య దీపాంకురము ; దేశ దేశములకు
యుగ యుగమ్ముల చీకటు లుడిగిపోవ
గుండెలో నుండి నెత్తురుల్ పిండిపోసి !

వలుబదికోట్ల భారత జనమ్ములవందల యేండ్లబంధన
మ్ములు సడలించినావు : జయముల్ గొనినావు : త్రివర్ణకాంతులన్
తళతళలాడు భారతపతాకము నాకము తాకునంతయె
త్తులకెగయించినావు, పగతుర్ కొనియాడగ పెంచినాడవున్.

మతముల గ్రుద్దులాటలను మాన్పు ప్రతిజ్ఞలతో ప్రజాసమై
క్యతకయి ప్రాణమొడ్డిన మహాత్ముడవీవు; భవిష్యకాల సం
తతులఖిల ప్రపంచజనతా నయనాంచలవీధి నీమహో
న్నత దరహాసమూర్తి పయన మ్మొనరింపగ చూచుచుందురే !

కాలసవిత్రి వందలయుగమ్ముల భీషణ గర్భవేదన
జ్వాలలలో సుఖప్రసవ సౌఖ్యమునందెను నీవుభూమిపై
కాలిడగానె - భారత జగజ్జననీ నయనాల నెత్తురుల్
జాలయిపారె నీవుదివిషత్పుర మార్గములందు కాలిడన్ !

పల్లెల గొల్లవాడవయి పాలుభుజింతువు; ధోతిగుడ్డ మో
కాళ్లను దాటనీయ వొకకఱ్ఱను చేతికి నూతజేసి ఊ
ళ్లూళ్లకు, శాంతికుంభము శిరోపరిభాగమునే అహింసయున్
చల్లలసమ్మబోయెదవు, స్వామి! నరాకృతి సత్యదైవమా!

గాయములందు నెత్తురులు కార్చుచు భీషణయుద్ధ రంగభు
ద్గాయితధారలన్ భయదయై విలపించెడి కాలదేవినీ
చాయచికిత్స నందినది—శాంతిమహౌషధి త్రాపినావొ, బా
పూ! యెవరయ్యనీవు? యతివో మునివో ఋషివో భిషక్కువో!

మానిర్భాగ్యులకీవు దిక్కుడువె? దుర్మార్గుండు మాలోనివా
డేనిన్నాహరియించె; భారతజగంబీనాడు శోకిల్లె—సం
ధ్యానృత్య ప్రవణప్రణీల గళపాదస్వర్ణ మంజీరనా
దానందమ్మున 'రామ, రామ' యనుచున్ స్వర్గాధ్వముల్ దాటితే!

బాహులుడింపి అర్ధశతవత్సర శాంతి రణమ్ముచేసినీ
దేహము క్రుంగిపోయినది; తీరనినీఉపవాస దీక్షలో
దాహము నింగిదాటినది; తండ్రివి, ఇంటికిపెద్ద వైన ఓ
మోహనమూర్తి! నీముసలిబొంది తుపాకుల దాడికోర్చెనే!

నీలనీలాకాశ ఫాలభాగము నుండి
రవిబింబ కుంకుమచ్ఛవులు రాలె;
ఉషాదేవతా రమ్యపాద మంజీర శిం
జాగుంజ నమ్ముల శ్రావ్యమయ్యె;

స్వాతంత్ర్య కన్యానవన్నవ వైవాహ
వేదిపై వైధవ్య నాదమలరె;
లోకకంటక జనానీక ఘూకవికార
హేళనధ్వనులు విన్పింపసాగె;

చేతులారగ నీవుపెంచిన స్వతంత్ర
నాగవల్లికయే విషనాగమయ్యె;
నీగళము చుట్టి ప్రాణాలు లాగివేసె!
భారతీయుల గౌరవ ప్రతిభమాసె.

నీవొక దివ్యజ్యోతివి
నీవొకధ్రువతార; వమరిణీయమునా జా
హా విగత నరాకారుడ
వా విర్భవియింతు వామహాత్మామరలన్ !!

# అమృత ప్రభాతము

( భారత రిపబ్లిక్ అవతరణ సందర్భమున...26-1-1950నాడు )

చూడు, సహోదరీ ! తరుణశోణ కరాగ్రములన్ ప్రభాతపుం
జాడల బాలపద్మములు సాచినఅంజలులన్ గ్రహించుచు
న్నాడు పయోజబాంధవుడు; నాలుగుదిక్కుల స్వర్ణవర్ణముల్
మేడలు కట్టుకొన్నవి గమించిన చీకటి నీలిదారులన్.

తరతరాల స్వప్నమ్ములు తరలివచ్చి
నిత్యసత్యమ్ములై పూవణించె నేడు;
భరత మాతృకిరీట శిఖరమునందు
చిన్మయానంద మణి ప్రకాశించెనేడు.

నేడు హిమాచలాగ్ర శిఖిరిక్కెను నింగికి తాకునట్లు; కో
రాడెను మా పురాభరతరాట్ ప్రతిభల్ భువిలో; అశోక స
మ్రాడభిరమ్య చక్రము సరానరిధర్మ పాథానసాగె; ఈ
రేడు జగాలుపూలు కురిపించెను భారతమాత యాదలన్

సర్వసర్వంసహా చక్ర నిర్వికల్ప
చారు సర్వస్వతంత్ర ప్రజా ప్రభుత్వ
భాజనంబైన భారత భూజనంబు
పూజనీయంబు, శాంతి నీరాజనంబు.

దాశరథి కృష్ణమాచార్యులు

# ప్రత్యూష

[ కవి పరిచయము ]

# అడ్లూరి

## అయోధ్యరామయ్య

జననం : 1932

ప్రపంచంలో జరిగే విషయాలతో తనకేమీ సంబంధము లేనట్లు, రేపటి చింతలేక, ప్రస్తుతానికే ప్రాకులాడుతూ యేదో తొందరలో వుంటున్నట్లుగా కనపడినా, యిటీవల తెలంగాణాలో సముగ సాహిత్యాన్ని వెలయించిన కవికుమారుల్లో ఈయనొకడు—పద్యాలు, గేయాలు, బుఱ్ఱకథలు, వ్యాసాలు, నాటికలు ఒకటేమిటి-సాహిత్య వీధుల్లోని అన్నిరంగాలలోనూ వీరవిహారం చేసినవారు అరుదు. వేదికలపై బాగామాట్లాడగలుగును. పద్యాలు చక్కగా వ్రాయను చదువనూగల సమర్థుడు. 'భాగ్యనగర' మాసపత్రికకు సంపాదకుడై భాషాసేవ చేస్తున్నాడు.

రచనలు :

[ముద్రితము] 1. దీపావళి 2. ఘంటారావము 3. ఆంధ్రకేసరి
4. స్వాతంత్ర్యగీతాలు 5. తెలంగాణా మంటల్లో...,
6. లాటికొండ 7. అన్నపూర్ణేశ్వరీ శతకము
8. సీతారామ శతకము, 9. సంస్కారణాలు (బుఱ్ఱకథ),
10. ప్రజావిప్లవం - విజయం (బుఱ్ఱకథ).

[అముద్రితము] రుద్రమదేవి (నాటిక).

వర్ణ త్యా ష

# కప్పగంతుల

## లక్ష్మణశాస్త్రి

జననం : 1917

ప్రబంధ రచనా విధానంపై ఆదరణ సన్నగిల్లిన ఈ రోజుల్లో కూడా ప్రబంధరచనకు పూనుకొని కావ్యములు, తిరిగిన విమర్శకులచే 'శబాస' నిపించుకున్న ఈయన ఆంధ్ర గీర్వాణ భాషల్లో నిష్ణాతుడైన పండితుడు. పైకి కనపడని శిష్టమైన హాస్యయుత సంభాషణా చాతుర్యంతో క్రొత్తవారిని యిట్టే స్నేహితులుగా చేసుకుంటాడు.

చిన్న వయసులోనే, కీ॥ శే॥ మాదిరాజు విశ్వనాథరావుగారితో కలసి కావ్యరచన సాగించినాడు. శ్రీ రావుగారి సహకార ప్రోత్సాహములు ఈయన ప్రతిభకు యెంతో దోహదం కలుగచేసినవి.

తెలంగాణములోని తెలుగు జాతిని మేల్కొల్పి నిరక్షరాస్యత నిర్మూలనము చేయుచు జాతీయ నిర్మాణ కార్యక్రమమునకు తోడ్పడుటే ఈ కవిపుంగవుని మహదాశయము. సారస్వత పరిషత్తు కార్యనిర్వాహకులలో నొకడై తెలంగాణాలోని సాహిత్యోద్యమాలకు విశేషంగా చేయూత నిస్తున్నాడు.

రచనలు :

[ముద్రితము] కర్ణసుందరి (బిల్హణ నాటికకు ఆంధ్రానువాదము).

[అముద్రితము] 1. బిల్హణ విక్రమాంకదేవ చరితాంధ్రానువాదము,
2. వనపర్తి సంస్థాన చరిత్రము.

# కాళోజీ
# నారాయణరావు

జననం : 1914

ఆకృతిలో ఎంత నాజూకుగా కనపడతాడో కవిత్వంలో అంత వైశిత్యం ఉంటుంది. అధిక్షేప కావ్యాలు (Satirical Poetry) నూతన ఫక్కీలో వ్రాసే తెలంగాణా రచయితల్లో ఈయన పేరు చెప్పి మరొకరి పేరు చెప్పాలి. వ్యంగ్యమూ అధిక్షేపానికి తోడుగా ప్రతిభావంతమైన హాస్యం గూడా ఈయన రచనల్లో నుంచి తొంగిచూస్తుంది. ఇంత సున్నితమైన హాస్యాన్ని (Subtle humour) ప్రదర్శించినవారు తెలుగు రచయితల్లో, ముఖ్యంగా గేయ కవులల్లో, అరుదు. ఈయన కవిత్వంలో యిది ఒక విలక్షణమైన గుణము.

'అవనిలో జరిగేటి అవకతవకల'పై ఈయన రచనలు కొరడా పెట్లు వంటివి! సమకాలిక రాజకీయాల్లోని ఒడిదొడుకులను, నాయకుల తప్పులను ప్రభుత్వాల దౌర్జన్యాలను, సంఘంలోని అవినీతిని, కపటాన్ని ఈయన కనికరం లేకుండా విమర్శిస్తాడు. వక్తల పది ఉపన్యాసాలకంటే ఈయన ఒక గేయం ఏ విషయాన్నైనా ప్రజల హృదయాలకు సూటిగా తాకేట్లుగా చేస్తుంది.

సజీవమైన ప్రాంతీయాలతో సర్వసామాన్యమైన ఉపమానాలతో అసామాన్యమైన భావాలను మనస్సులో రేకెత్తిస్తాడు. అభ్యుదయ కవిత్వానికి ఉండవలసిన ప్రయోజనమూ, ఆనందమూ ఈయన కవిత్వంలో తప్పకుండా

ఉంటాయి. ఎడతెగకుండా హాస్యధోరణిలో సంభాషించగలడు. అభిప్రాయాలలో అతివాదివలె పొడకట్టినా, ఈయనతో ఒకసారి మాట్లాడిన వాడు ఎప్పుడూ ఈయన్ని మరువలేడు. న్యాయస్థానంలో ఉపయోగించవలసిన వాక్చాతుర్యాన్ని, న్యాయవాదియైన యితడు, సాహిత్య రంగంలో ఉపయోగిస్తాడు.

మహారాష్ట్రము, యింగ్లీషు, ఉర్దూ భాషల్లో ప్రవేశము కలదు. ఉర్దూలో రచనలుకూడా చేస్తాడు.

'ఆనందావేదనల ప్రదర్శనమే' తన కవిత్వానికి ఆశయమనీ, జీవితాదర్శం మాత్రం 'ఖేదమూ మోదము లేకుండా మదిలో క్రీడించే' దశ చేకూరాలని ప్రయత్నించుటే అనీ వినమ్రుడై అమాయకంగా చెప్పుకుంటున్నాడు. కాని రసపారవశ్యంచేతనే, అరచేతిమీద వెన్నముద్దవలె కరిగిపోయి ఆనందాశ్రువులో దుఃఖబాష్పాలో రాల్చే ఈ అతి సున్నితమనస్కుడు, లోకంలో రోజూజరిగే అన్యాయాలనూ, అక్రమాలనూ సహించలేక ఆవేశంతో—దిన పత్రికలలో వ్రాసినట్లు ఎన్నో విషయాలపై—ఉత్తేజకరమైన గేయాలు వ్రాసినాడంటే ఆశ్చర్యంలేదు. చిన్నకథలూ; యితర లఘువచన రచనలూ అనువాదాలుకూడా చేస్తాడు.

ర చ న లు :

[ముద్రితము] 1. కాశ్మోటీ కథలు, 2. నా భారతదేశ యాత్ర.
(రెండూ అనువాదాలే)

[అముద్రితము] 1. పరమాత్ముని ఆత్మకథ, 2. ఖండకావ్యాలు.

# కేశవపంతుల

# నృసింహశాస్త్రి

జననం : 1919

‘మానవునికి మానవత్వాన్ని, జీవిత మాధుర్యాన్నీ ప్రసాదింపగల కవిత్వముద్వారా దేశమాత సేవ చేయుటే ఆశయంగాగల ఈ యువకవి సంస్కృతాంధ్ర భాషల్లో మంచి పాండిత్యము గడించుకొన్న దిట్ట. ప్రాచ్య విజ్ఞాన విస్తృతికై శ్రుతి స్మృతి పురాణపరిశీలనలో, వేదాంతశాస్త్ర పరిశ్రమలో తన తీరిక కాలాన్ని గడుపుతూ, విజ్ఞానవర్ధనీ పరిషత్తు, ఆంధ్ర సారస్వత పరిషత్తు మొదలగు అనేక సాహిత్య విద్యావ్యాపక సంస్థలతో సంబంధము కలిగించుకొని యితోధికంగా భాషాయోషను పూజిస్తున్నాడు.

భావ సంపూర్ణమై చక్కని ధారాశుద్ధి కలిగిన కవిత్వమును సరళంగా వ్రాయగల నిపుణుడు. ఎప్పటికప్పుడు సందర్భోచితంగా వివిధ రచనలను— ముఖ్యంగా శ్రవ్య నాటికలను, ప్రహసనాలనూ-శిల్పవిన్యాసం చెడకుండా రచించుటలో ఈయన కలం కదం త్రొక్కుతుంది.

శ్రావ్యంగా పద్యాలు చదువగల [illegible] ఈయన వాణి హైదరాబాదు రేడియోద్వారా అనేకుల ప్రశంసలకు పాత్రమైనది.

కావ్యరంగంలో ఈయన ప్రతిభకు తగిన కీర్తిని త్వరలో సంపాదించుకొని తన అగ్రస్థానాన్ని అలంకరించగలడనుటకు సందేహం లేదు.

ప్రత్యూష ———

రచనలు :

[ముద్రితము] 1. త్యాగధనులు, 2. రత్నలక్ష్మీశతకము.

[అముద్రితము] 1. మసూర నిశీథము 2. ఉదయసుందరి 3. సందేశము
4. మంగళసూత్రము 5. సూర్యనారాయణ శతకము
6. వివిధ నాటికలు.

# ఖండవల్లి లక్ష్మీరంజనము

జననం : 1908

పిల్లలలో పిన్నయై, పెద్దలలో పెద్దయై అందరకీనితలలో నాలుకయై మెలగు నీతడు తెలంగాణములోని సారస్వతోద్యమములకు ప్రశంసనీయమైన సేవ చేయుచున్నాడు. సంస్కృతాంధ్ర భాషలలోనేగాక ఆంగ్లమందును వైదుష్యము గడించుకొన్న ధీశాలి. ఆంధ్రభాషలోని పృథక్త్వమును, తెనుగు నుడికారములోని తీయదనమును గ్రహింపలేని ఆంధ్రేతర సాహిత్యోపాసకులకు చక్కగా అవగాహనమౌనట్లు యింగ్లీషు భాషలో అనేక వ్యాసములను వ్రాసి ప్రచురించినాడు.

అసలు విషయమును వదలిపెట్టి యేవియో నాలుగు కులాసామాటలు చెప్పి తమ పాండిత్యమును ప్రదర్శించుకొను కొందరివలెగాక, ఈయన ఉపన్యాసముగాని, వ్యాసముగాని విషయపరిపూర్ణతలో కొరవడక దేనికది ఒక సమగ్ర గ్రంథమువలె నుండును. కవిత్వములోగూడ ఈయన యించుమించు యిదే మార్గమును అనుసరించినట్లు కనపడును. అయినను, రవిగానని భావములను ఈయన కనును గావున కవియైనాడు! ఈ భావపుష్టియే ఈయన చేత కవిత్వం వ్రాయించును. సునిశితమై కూలంకషమైన విమర్శనాశక్తి ఈయనకు సహజముగా అలవడినట్లున్నది. రాజకీయములకు సంబంధించిన విషయములపై సులభ గ్రాహ్యముగా విద్యార్థులకు ఉపయోగకరమైన వ్యాసములు వ్రాయుటలోకూడ దక్షుడు.

విద్యార్థిదశలో అలవరుచుకున్న పరిశోధనాభిలాష పరిశ్రమాభ్యాసము యిప్పటికిని తరుగక యుండుట ఈయనలో ఒక ప్రత్యేక గుణము. ఈ కారణముచేత మున్ముందుకూడ ఈయన అనేక ఉద్గ్రంథములను రచించి తెలుగువాణికి నిరుపమానమైన సేవ చేయగలరని చెప్పవచ్చును.

ర చ న లు :

[ముద్రితము] 1. తెనుగుదుక్కి 2. రెండో ప్రపంచ యుద్ధమా ?
3. ఆంధ్ర సాహిత్య చరిత్ర.

ప్రి త్యా ష —————————— ౯

# గడియారం

## రామకృష్ణశర్మ

జననం : 1919

ఒకకాలు రాజకీయరంగంలో, యింకొక కాలు సాహిత్యరంగంలో నిడి రెండింటిలోగూడా పెద్ద పెద్ద అంగలను వేస్తూ ముందుకు వెళ్లుతూ ఉంటాడు ఈయన. ఆంధ్రుల సర్వతోముఖాభివృద్ధికి పాటుబడుటే యీతని జీవితలక్ష్యము. ప్రజల సమస్యలను యితివృత్తముగా తీసికొని, అక్రమములను నిర్దాక్షిణ్యముగా ఖండించి ప్రబోధం కలిగించుటే ఈయన కవిత్వానికి ఆశయం.

నాటకరంగంద్వారా కళల ప్రచారం బాగా జరుగుతుందని ఈయన నమ్మకం. కమ్మగా పద్యాలు చదివి శ్రోతల హృదయాలను చూరగొనే అమోఘ శక్తి అందరికీ వుండదు. ఎంత నీరసమైన పద్యమైనా ఈయన చదివితే రసం పోసుకుంటుంది. తెలంగాణాలోని చారిత్రక పరిశోధకులను పేర్కొన్నప్పుడు ఈయనను యెవరూ విస్మరింపజాలరు. ఆంధ్ర సారస్వత పరిషత్తుకు అనేకవిధాల సేవచేస్తున్న ముఖ్య కార్యకర్తల్లో ఒకడు.

రచనలు :

[ముద్రితము] ఆలంపూరు శాసనములు.

[అముద్రితము] 1. చంద్రహాస (పద్యకావ్యం) 2. ఆలంపూరు శిలాలేఖనములు 3. తెలంగసంస్కృతి 4. చాటుపద్యాలు 5. ఆంధ్ర కువలయానందము (అసంపూర్ణము)

# గార్లపాటి రాఘవరెడ్డి

జననం: 1904

మానవుని గమ్యమేమో తెలియగోరుటే పరమాశయంగాగల ఈయనకు భాషాసేవయన్న అత్యంత ప్రీతి. ఆర్యధర్మానికి అనుగుణంగా తన జీవితాన్ని దిద్దుకొన్న ప్రాజ్ఞుడు. నిర్దుష్టమైన కవిత్వం వ్రాయుట ఈయనకు అలవాటైపోయింది. చక్కని గేయాలుకూడా వ్రాస్తాడు.

భగవంతుని లీలా విలాసాలను పద్యాల్లో పాడుకుంటూ యెప్పుడూ సాధు సావాసంలో కాలం గడిపే మృదుల హృదయుడు.

రచనలు:

[ముద్రితము] పరిదేవనము.

[అముద్రితము] చలికాలము (ఖండకావ్యం).

# జమ్మలమడక సూర్యప్రకాశరావు

జననం : 1919

సాధనసమితి స్థాపకుల్లో నొకడై నాటినుండి నేటివరకు సమితి నిర్వహణలో తోడ్పడుతూన్న ఉత్సాహి ఈయన. సుస్నిగ్ధమైన భావాలను కనుపడీ కనుపడనట్లు ఈయన తన గీతాల్లో అల్లుకపోతాడు. లలితమైన పదాలను యేరుకొనుటకు ఈయన కలం బాగా అలవాటుపడ్డది. ఏదో అవ్యక్తమైన సౌందర్యాన్ని, అంతుపట్టని కళాస్వరూపాన్ని, అదృశ్యమైన దివ్యశక్తినీ ఈయన ఆరాధిస్తూ ఉంటాడు.

'కవిత్వంలో, జీవితంలో నాకు ఆశయంవుందా?...' అని ప్రశ్నించుకుని, 'ఉంటే మల్లెపూవుకూ, అగరువత్తికీ, దేవునిముందు వెలిగే హారతి కర్పూరానికీ ఉన్న ఆశయమే నాకూ వుంది. వాటికేమీ లేకపోతే నాకూ యేమీ లేదు' అని బదులు చెప్పుకున్న నిరాడంబర జీవి. బౌద్ధవాఙ్మయమన్న ఈయనకు అత్యంత అభిమానము.

శరదిందు రేఖవలె, గులాబీ ఘుమఘుమవలె ఈయన పద్యాలు సుఖాన్ని పరిమళాన్నీ కూరుస్తాయి. ఈయన వచన రచన పుష్పవనవాటివలె హృదయంగమంగా వుంటుంది.

చిన్న కథలను, పద్యనాటికలను కూడా ప్రతిభావంతంగా వ్రాయగల నేర్పరి.

**రచనలు :**

[ముద్రితము] సాంధ్యగీతి (నాటిక—ఈయన, ఈయన సోదరుడు శ్రీ పూర్ణచంద్రరావు కలిసి వ్రాశారు)

[అముద్రితము] తపోవనము (నాటిక); ఖండకావ్యాలు.

# దాశరథి
# కృష్ణమాచార్యులు

జననం : 1927

శరధిలో ఎన్నిరకాలైన రత్నరాసు లుంటాయో దాశరథి కవిత్వం లో అన్నిరకాల పద్యరాసు లుంటాయి. కవిత్వం ప్రారంభించిన వయోత ప్రాయంనుంచీ, యెప్పటికప్పుడు క్రొత్తగా కనుపడి శరీరాన్ని పులకరింప జేసే రచనలు వెలువరింప గలిగి, ఉత్పత్తి ఉత్తమగుణమూ కొరవడకుండా, భావనలో, రచనలో, భాషలో ఉదాత్తమైన నవ్యతను పొదుగించుకున్న ప్రతిభా సమన్వితుడీ కవికుమారుడు.

భావసాగరాలు పొరలుతూ వచ్చిపడితే, ఈయన లేఖిని కౌగిలిలో కవితాకుమారి సంబరపడి నవ్వుతుందట! అప్పుడు ఈయన, స్వర్గానికి భూమినుండి రసగంగలు చిమ్ముతాడట!!

ఆగర్భ శ్రీనాథుడికీ, అనాథుడికీ చిరకాలంనుంచి జరుగుతున్న సంఘర్షణే ఈయన కవితావస్తువు. త్రాగుటకు గంజి, ఒళ్ళు దాచుకోడానికి చింకిపాత, నిలువడానికి నీడా నోచుకోని నిర్భాగ్యజీవుల అభ్యుదయమే ఈయన రచనలకు ప్రేరణ. అందుచేతే 'పీడిత ప్రజావాణికి మైక్ (Mike) అమర్చి అభివాదులకు వినిపిస్తా' నంటున్నాడు...... 'సమ సమాజం' అనే కల నిజంకావడమే ఈయన జీవితానికి ఆదర్శము కవిత్వానికి ఆశయమూ అయింది.

ఈయన, కేవలం 'నీరవ నిరంత నిశానిబిడాంధ కావ్యాల'ను రచించుటేగాక, 'ప్రేమమయ దివ్యస్వాంత గీతాలు' వ్రాస్తాననీ, 'కాంతాధర కంపిత ప్రవచనశ్రీలే ఉటంకిస్తా'ననీ కూడా అంటున్నాడు. అయితే ఈయన రచనల్లో మాత్రం, 'పేదల ఎంగిలి మెతుకుల దొంగిలించి బంగారంపొంగించే ధనికులను మ్రింగాలని దొంగచాటుగా కాలం తొంగిచూస్తున్న' దను హెచ్చరికలు, 'నీ పిల్లలనూ యిల్లాలినీ కిల్లీ మాదిరిగా నమిలే మిల్లు మ్యాగ్నేట్లకు (Mill magnates) నీ వేడినెత్తురులో షవర్ బాత్ (Shower-bath) తీసుకునే భువనైక ప్రభువులకు...నీ నిరుపేదగుండె యెగ్గు సేయ బూనదు! అదెంతటి ఓర్పు కాదవో' అని గ్రామికుని ఉద్దేశించి చేసిన ప్రేరేపణలే యెక్కువగా కనపడతాయి.

హైదరాబాదు సంస్థానంలో పోలీసుచర్యకుపూర్వం ప్రజలపై జరిగిన ఘోర అత్యాచారాలు, సహజంగా, యితరులకువలె దాశరథిని కూడా ఆగ్రహావేశుడిగా చేసినవి. కాని ఈయన హృదయంలో రేగిన విశిఖానల జ్వాలలు, ఈయన రచనల్లో సగానికి సగం పాలుపంచుకున్న సమర సాహిత్యాన్ని సృష్టించినాయి. ఈ సాహిత్యానికి విషయ ప్రాధాన్యతవల్ల చారిత్రక మూల్యము ప్రతిభావంతమైన కవిత్వకారణంగా రసమూల్యమూ చేకూరినది.

అసాధారణమైన ఉపజ్ఞను, బహుముఖమైన ప్రతిభనూ చూపెడుతూన్న దాశరథి అభ్యుదయ కవుల్లోను, యితర విప్లవ రచయితల్లోను తలబంతి అనిపించుకున్నాడు. జనసామాన్యంయొక్క హృదయాలలోని ఆకాంక్షలను ఇంత శక్తివంతంగా ఇంత ధైర్యంగా వ్యక్తీకరించిన యువకవి

ఆంధ్రావనిలో అరుదని చెప్పిన అతిశయోక్తి కాజాలదు. కాబట్టే ఈయనకు యింత చిన్నవయసులో మహాకవి అనే బిరుదు లభించిందేమో అనిపిస్తుంది.

ఆధునిక కవితారీతులను నిత్యనూతన పథాలలో నడిపించి, రచనాపద్ధతులలో యెప్పటికప్పుడు మార్పులు తెస్తున్న ఖండాంతర రచయితల కృతులను తెనుగులోకి అనువదిస్తూ,వారికన్న తను వెనకబడకుండా ఉండుటకు ప్రయత్నించే సాధనకూడా ఈయనలో లేకపోలేదు. రచనా విధానంలో అరాచకాన్ని తీసుకరావడానికి యెంత సంసిద్ధుడో ఛందోబద్ధమై సలక్షణమైన ఆశుకవిత్వం చెప్పడంలోగూడా అంత సమర్ధుడు.కథలుకూడా చక్కగా వ్రాస్తాడు.

చదువగానే కంఠస్థమై అర్థము తెలియనివారికి సహితం ఆనందం కలిగింపజాలే ఈయన పద్యాలను ఈయనే స్వయంగా చదువుతే వినే శ్రోతల రసపారవశ్యానికి మేర లేదు.

అలంకార వ్యాకరణ శాస్త్రాలు చదువుకొని ఆంధ్ర సంస్కృత భాషలలో పాండిత్యము సంపాదించుకున్న వాడగుటచేత అక్కడక్కడ రచనల్లో పాండిత్య ప్రకర్ష గూడా ఉంటుంది కాని శిల్పానికి యెక్కడా దెబ్బ తగులదు. ఈయనకు అద్భుతమైన ధారణాశక్తి ఉండుట మరొకవిశేషం.

## ర చ న లు :

[ముద్రితము] అగ్నిధార (ఖండకావ్యం)

[అముద్రితము] రుద్రవీణ (ఖండకావ్యం)

# దేవులపల్లి
# రామానుజరావు

జననం: 1916

తన జీవితాన్ని, బాల్యంనుంచే, ఆంధ్రభారతి ఆరాధనకు అంకితం చేసినాడు ఈయన. విద్యార్థిదశలోకూడా ప్రభుత్వోద్యోగాలకై పాకులాడక కాలాన్నంతా భాషాసేవకై వెచ్చిస్తూ తెలుగువారి యశశ్శ్రీ సంపదలను పూర్వౌన్నత్యాన్ని పునః ప్రతిష్ట చేయడానికి కంకణం కట్టుకొన్న సిద్ధసంకల్పుడు. ఈయన కవితా లతాంగి తెనుగుతల్లి పూలపాత్రిళ్లలో ఆడుకుంటుందేగాని పంతాలతో పోటీలతో తన్నుకచచ్చే ధూర్త ప్రపంచం జోలికి పోదు. తెలుగువారిలోయని గృహ జీవితాన్ని ఉత్తమమైన సాంప్రదాయాలను ఉన్నతమైన సంస్కృతినీ ప్రతిఫలింప జేసేయితివృత్తాలను తీసుకొని సులభశైలిలో అమృతతరంగిణివలెసాగిపోయేగీతాలు వ్రాయుటలో ఈయన ఉద్దండుడు. సాహిత్యవిమర్శకులలో ప్రథమశ్రేణికి చెందదగినవాడు. విషయ పరిపూర్ణమగు వ్యాసాలు, చక్కని లఘుజీవితచరిత్రలు వ్రాయుటలో ఈయన కలం ఆరితేరింది. తెలుగుభాషలో వివిధములైన వచన రచనలు లేవను ఒకపెద్ద లోటును తీర్ప ప్రయత్నించు యువరచయితలలో ఈయన ప్రముఖుడు. హసన్ముఖం చూస్తే ఖండితవాదివలె కనపడడు. కాని సంభాషణలో తీవ్రమైనఅభిప్రాయాలు బయటపడుతాయి. కార్యరంగంలో ఈయనచూపేపట్టుదల, ఉపయోగించే తెలివితేటలు, సిద్ధించుకునే పరిపూర్ణత్వాన్ని గమనించేవారికి ఈయనలో ఒకఅద్భుత నిర్వాహణాశక్తి ఉన్నదని తోచకమానదు.

ఆంధ్ర సారస్వత పరిషత్తుకు బహిఃప్రాణమై మూలయంత్రమువలె పనిచేస్తున్నాడు. సాధనసమితి,దక్షిణభారత సంసద్, నాట్య కళాపరిషత్తు మొదలగు అనేక సాహిత్య సాంస్కృతిక సంస్థల కార్యకలాపాల్లో భాగస్వాములై, హడావిడిగా ప్రచారం చేసుకోక సిసలైన కృషి చేస్తున్నాడు.

గ్రంథాలయ పునరుద్ధరణం,ప్రయోజన విద్యావ్యాప్తి ఈయనకు అభిమాన ప్రధానమైన యితర వ్యాసంగాలు. 'శోభ' మాస పత్రికకు సంపాదకుడుగాను,'గోలకొండదినపత్రిక'కు సహాయసంపాదకుడుగాను ఉంటున్నాడు. 'హృదయము కదలి ఆర్ద్రమైనప్పుడే, అంతరంగమునుండి ప్రేరణ కలిగినప్పుడే' కవితా వీధిలో అడుగు పెడతాడు... ఒకరి ఆగ్రహానుగ్రహాలను పాటించక సత్యమని త్రికరణశుద్ధిగా నమ్మిన దానిని నిర్భయముగా ప్రకటించుచు తెలుగు భాషకు సేవజేయుటే తన జీవితానికి ఆదర్శంగా పెట్టుకున్నాడీయన.

రచనలు:

[ముద్రితము] నవ్యకవితా నీరాజనము. (సాహిత్య సమీక్ష)

[అముద్రితము] 1. ఏకవీర 2. పచ్చతోరణము. (ఖండ కావ్యాలు)

# ధవళా
# శ్రీనివాసరావు

జననం: 1919

అతికోమల హృదయుడీ కవికుమారుడు. చిన్నప్పటినుంచీ పత్రికలాళ్ళ సంటపాలాల్లో సత్సాంగత్యము పండితగోష్ఠి సంప్రాప్తమయిందీతనికి. వినయము, సహజ సౌశీల్యము ఈయనకు పెట్టని ఆభరణాలు. శ్రీ కవిరత్న అంబటిపూడి వేంకటరత్నంగారి ప్రియశిష్యుడు. గురువుగారి ఆశీఃప్రభావంతో చందూరు ప్రాంతమున నెలకొల్పబడిన "సాహితీ మేఖల" ముఖ్య సభ్యుడై ఆధునిక ఆంధ్రకావ్యాలను చదువుకొని ఉత్తమ రచనకు, ఉపన్యాసానికివలయు కళాదృష్టిని భాషా పరిజ్ఞానాన్ని, సంపాదించుకున్నాడు.

చేలన్నీ పచ్చదనంతో కలకలలాడుతూ ఉండాలని ఈయన ఆశయం. మండు టెండలకు ఎండి, వాడిపోయే పొలాలుజూచి తన కన్నీళ్ళతోనైనా వానికి తేమగూర్చాలని కోరుతాడు. వానితోపాటు తానూ బాధపడుతాడు. ప్రపంచంలో నేడు గోడసూపుచున్న పొరపొచ్చాలైనా, గ్రామప్రజలకు సౌఖ్యము ఆరోగ్యము బలమూ కూర్చాలని ఈయన తలంపు. "వేదారాంగసలు భువనమోహినులై అక్షరరూపమున వర్షించే అమృతమును నిస్సాక్షికంగా అందరమూ అనుభవించాల"నే ఈయన ఆకాంక్ష.

నిజమైన కవిని గ్రహించే సౌభాగ్యాన్ని గడించే కోరికతోనే తన సాహిత్య జీవయాత్రను సాగిస్తున్నాడట! వేదనాభరంతో నుగ్గి పోయిన

హృదయాలను మథించి అమృతభాండములను అందించగల మధుర కవుల లో ఈయనఒకడు. ఎక్కడైనా కరుణ రసప్లావితమైన ఒక వింత మధురధ్వనులెసగు గీతాలు వినవస్తే, ఆగీతాలు పాడిన గళమితనిదేఅని పోల్చుకోవచ్చును సులభంగా.

ర చ న లు:

[అముద్రితము] ఖండకావ్యాలు. వ్యాసాలు.

## పర్సా జానకీదేవి

జననం : 1923

మహిళాభ్యున్నతి, పీడిత సముద్ధరణే ఆశయంగా పెట్టుకొని, నిరాడంబరంగా రచనలు సాగిస్తున్న లలితకళారాధకురాలు ఈమె. హిందీవిద్యాభ్యాసము, గృహపరిశ్రమ మొదలయిన యితర వ్యాసంగాలు కూడా లేక పోలేదు. రచనారంగంలో ఈమె కవితాకుమారి యింకా క్రొత్త క్రొత్త భంగిమలను చూపెట్టి తన అర్హస్థానాన్ని త్వరలో సంపాదించుకోగలదని ఆశింపవచ్చును.

ర చ న లు :

[అముద్రితము] 1. రసాంజలి 2. వలింపశ్రీ 3. మధురస్మృతి.

# పల్లా దుర్గయ్య

జననం : 1916

ఆనందమే కవిత్వానికి సద్యోఫలమను సిద్ధాంతాన్ని ప్రగాఢంగా నమ్మినా, ఉపదేశములు సందర్భానుసారముగ కావ్యాదుల్లో ఉండవచ్చుననే మధ్యమార్గంలో నడుస్తాడు. అతి దీర్ఘ సంస్కృత సమాసాలు లేకుంటే మంచిదేకాని, తనంతతాగా వచ్చిన సమాసాలను అట్లే ఉంచాలని, ఛందో నియమాలను పాటిస్తూ, అర్థాలంకారాలతోపాటు శబ్దాలంకారాలకును సమాన ప్రాధాన్య మొసగాలెనని, గేయాల్లోమాత్రం కొంత స్వేచ్ఛ వహించవచ్చుననీ యీతని అభిప్రాయము. ఇదేదృష్టితో ఈయన గేయాలు వృత్తాలు నడిపిస్తాడు. తెలంగాణములోని వ్యవహారభాషను సమయానుకూలంగా ఉపయోగించి తన రచనలకొక అపూర్వశోభను కూరుస్తాడు.

కవిత్వాన్ని కళగా ఉపాసించుచు మాతృభాషను కొల్చుటే ఈయన జీవితాదర్శము.

ఈయన రమణీయంగా పద్యాలు వ్రాసేశక్తిని ఆకళించుకున్నాడు. ఉత్తుంగ భావ శిఖరాలపై యిట్టే యెగిరిపోతాడు. మధుర చంద్రికాపూరం వలె గిలిగింతలు పెట్టి హాయిగొల్పే గేయరచనలుకూడా చేస్తాడు.

మితభాషియై నిరంతర పరిశ్రమలో తనపని తాను చూసుకునే స్వభావం యితనిది. ఆంధ్రభాషా నిఘంటువును అక్షర సంఖ్యానుసారముగ వ్రాస్తున్నాడు.

రచనలు :

[అముద్రితము] 1. ప్రణయపరీక్ష (ఖండకావ్యం) 2. మనుచరిత్ర విశేషాంశములు.

# పిల్లలమఱ్ఱి వేంకట హనుమంతరావు

జననం : 1918

కళాజీవియని ఈయనముఖంచూడగానే చెప్పవచ్చును. ముగ్ధమోహనమైన కమ్మని గేయాలు విరివిగా వ్రాయగల ఒడుపు ఉంది ఈయనచేతుల్లో. ఆంధ్రభాషావధూటి, తరతరాలనుండి నడచివచ్చిన వివిధమార్గాలనూ తరచిచూచేప్రజ్ఞ గడించుకొన్న విద్యాధికుడు ఈయన.

సాధనసమితి స్థాపకులలో నొకడై, ఆంధ్రవిశ్వ కళాపరిషత్తులో చదువుకుంటున్నప్పుడు అక్కడసాధనసమితి శాఖనుఏర్పాటుచేసికొంతకాలము నిర్వహించినాడు. గుంటూరులో, నగస సారస్వతసమితి, ఆంధ్రసాహిత్యమండలి, జ్యోత్స్నసమితి మొదలుగాగల సంస్థలను నెలకొల్పి వాటిద్వారా గణనీయమైన సారస్వతసేవ చేస్తున్న అమితోత్సాహి ఈయన.

కవి; కథకుడు; నాటికాకర్త; విమర్శకుడు; వ్యాసకర్త. ఈయన మామగారగు శ్రీ కురుగంటి సీతారామ భట్టాచార్యుల "నవ్యాంధ్ర సాహిత్య వీధుల" రెండవ కూర్పులో భాగస్వామి.

రచనలు :

[ముద్రితము] 2. మధుకణములు (ఖండకావ్యం) 2. వత్సల (రూపకం) 3. వెలుగు - నీడలు (కథలు) 4. చిత్రి (నాటిక) 5. పంచవటి పర్యాలోకనం (వ్యాఖ్య) 6. సాహిత్య సమాలోచనము(సమీక్ష) 7. సాహిత్య సంపద (విమర్శ).

[అముద్రితము] 1. రాగరేఖలు 2. ప్రతిరూపాలు 3. దీపకళిక 4. ఏకాంకస్వరూపము 5. సాహిత్యప్రవచనము 6. మహోదయాలు 7. ప్రేమలేఖలు 8. విషజ్వాలలు.

# పులిజాల
# హనుమంతరావు

జననం : 1919

నిండుకుండ తొణకనట్లే ఈయన, స్వయంగా ఎవరికీ చనువీయక 'గుమ్మపాలల్లోని గోరువెచ్చదనము' వలె తన స్నేహామృతాన్ని యితరులకు పంచిపెడతాడు. బాల్యంనుంచీ ప్రకృతిమాత ఒడిలో గారాబంగా పెరిగిన లలితహృదయుడు. ఈయన గురువర్యులు శ్రీ అంబటిపూడి వేంకటరత్నకవిగారే ఈయననుగురించి, "మా హనుమంతరాయడసమాన కళా రస పానమత్తుడ" ని అన్నారు. ఈయన తనలో దాచుకున్న తెలుగుభాషలోని మెత్తదనాన్ని, సౌకుమార్యాన్ని అతి జాగ్రత్తగా కవిత్వంలో వాడి నిష్కాత్రిముగా రుచిచూపి, సహృదయులను ఎవరి సంస్కారం ప్రకారం వారిని రసానందం పొందుమంటాడు.

ఏదైనాకార్యం తలపెడితే దానిని సంపూర్ణంగా నెరవేర్చిందాకా నిద్రపోడు. ఎన్ని అవరోధాలుకలిగినా వెనుదీయక ఉత్సాహంతో ముందుకుపోయే దిట్టరితనము, నిర్మలస్ఫటికా సదృశమైన చిత్తశుద్ధికల యువకుల్లో ఈయన మిన్నగా ఎన్నదగినవాడు. ఉద్యమ నిర్వహణా సమగ్రత ఈయనకు పుట్టుకతోనే అబ్బడిందేమో అనిపిస్తుంది.

'సాహితీమేఖల' స్థాపకుల్లో ముఖ్యుడు. సుమారొక పుష్కరం నుంచి ఈ సంస్థను, నలుగురిలో ఒకడై, నిర్వహిస్తున్నాడు. "కవితా తపస్వుల రచనలను ప్రచురించుటేగాక, వారిని సన్మానించి, వారి యశస్సు నిర్వ

ఘన్నముగా కొనసాగుటకు వలయు సహకారమును నెరపుటయందు ప్రధానాసక్తి చూపుచు, 'సాహితీమేఖల' సర్వదా తన చిరుగంటల ఘలంఘలలతో ఆంధ్ర సాహితీరంగమును మంగళ నినాద పరిశోభితం చేయుటకై ప్రయత్నిస్తుంది" అని ఈయన హామీ ఇస్తున్నారు. ఈ సంస్థ తరఫున ప్రచురించిన మధుర కావ్యాలను చదివినవారుగాని, ఈయన కృషి ఫలితంగా తయారైన సాహిత్య క్షేత్రాన్ని చూసినవారుగాని ఈ 'హామీ'లో అతిశయోక్తి లేదని తెలుసుకోగలరు.

ఆంధ్ర సారస్వతపరిషత్తు ప్రధాన కార్యదర్శిగా ఈయన అకుంఠిత దీక్షతో తన కార్యభారాన్ని నిర్వహిస్తున్నారు.

రచనలు :

[అముద్రితము] ఖండ కావ్యాలు; వ్యాసాలు; కథలు.

## పొట్లపల్లి రామారావు

జననం : 1920

రచన జీవితానికి ఓ సందేశాన్ని ఇవ్వాలనీ, సంస్కారాలను దీప్తివంతం చేసి మానవుడికి జీవితపు తుఫానులో-గడ్డిపరకవలె కొట్టుకుపోకుండా-ఒక యోధుడిలా నిలబడానికి సరియైన ఆత్మజ్ఞానాన్ని, కాలగతిని గుర్తింపజేసే వివేకాన్ని ప్రసాదించాలని ఈయన ఆశయం. అందుకే ఈయన

రచనల్లో నీతిబోధకమైన సందేశాలు ఎక్కువగా ఉంటాయి. కాని రచన, కేవలం సందేశం అందజేయడం మాత్రమే కాక, సమయోచితంగా రచయిత అనుభవాలను వెల్లడిచేయడంకూడా అవసరం అనుకుంటాడు గాబట్టి ఈయన బహుళంగా రచనలను చేయగలుగుతున్నాడు. ఈ ఆశయమే, ఈ సందేశమే యితని ప్రతి రచనకూ జీవంపోసి, ఉదయభానుని కాంతిద్యుతులను కూరుస్తున్నాయి. "విశ్వకల్యాణం కోరేవారిలో కవి ఒకడు;- 'ఒకడు' అని అనడంగూడా అతడిని కించపరచడమేమో !_అగ్రేసరుడు! ! లోకదుఃఖ నివృత్తియే కవియొక్క పరమాశయం" అని ఈయన తలంపు. తను ఇంకా రచనలో ఆరంభదశలోనే ఉన్నాడనీ, తన ప్రయత్నాలు ఇంకా సఫలం కాలేదనీ, నిరంతర సాధనవల్లనే మానవుడు ప్రతిభావంతుడౌతాడనీ ఈయన అంటున్నాడు... ఇట్లా అనుకొని పరిశ్రమను మానుకోక తమంతకుతామే క్రమశిక్షణ గరపుకొను సాహిత్యోపాసకులు చాల తక్కువ.

అనేకంగా గేయాలు, నాటకాలు, వ్యాసాలు, చిన్నకథలు వ్రాసినాడు. కాని, రచనలను ప్రకటించే ఆతురతకన్న వాటిని పుష్టివంతం చేయడంలోనే ఈయనకు యెక్కువ ఆసక్తి ఉన్నది. 'నిర్జీవమైన రచనలు శతాధికంగా చేసేదానికన్నా, భావోద్దీపకమైన ఒక్క వాక్యాన్ని సృష్టించడం చాలని, ఈయన అనుకోవడంచూస్తే 'రసాత్మక వాక్యం కావ్యం' అన్న పూర్వుల రసవాదాన్ని అంగీకరిస్తున్నాడని తోస్తుంది.

ఈయన మితభాషి. కాని అగాధమైన జీవకారుణ్యం తొంగలించే కళ్ళతోనే తన మనసులోని ఆశయాలను, హృదయంలోని ఆవేదనను చెప్పుకుంటాడు. వేషంలో ఎంత నిరాడంబరత్వం ఉందో నడవడిలో అంత గాంభీర్యం కనబడుతుంది.

ర చ న లు :

[ముద్రితము] 1. జైలు (కథల సంపుటి)

[అముద్రితము] ఖండకావ్యాలు; కథలు; వ్యాసాలు.

# బూర్గుల రంగనాథరావు

**జననం: 1917**

ఈయన కూడా చిన్ననాటి నుండియే సారస్వత సంస్థలతో సంబంధము కలిగించుకొని, ఆంధ్ర శారదను ఆరాధించుచున్న భాషాతపస్వి. తెలంగాణము నందలి వివిధ ప్రాంతములలో నివురుగప్పిన నిప్పువలెనున్న యువకులను సాహిత్య రంగమునకు లాగుకొనివచ్చి, వారి ప్రతిభను లోకమునకు వెల్లడించు ఉదారహృదయుడు. అన్నిరంగములలో అడుగుబెట్టి అవకతవకలను చేయువారివలె గాక సారస్వత సేవయందే ఏకాగ్రతతో నిర్మాణాత్మకమగు కృషిజరుపుచున్నాడీయన. నిర్మాణ ప్రతిభ విమర్శనాశక్తి రెండును ఈయన హృదయమున అల్లిబిల్లిగా నల్లుకొని పోయినవి. సంస్థలను నిర్వహించుటలో గట్టిపట్టుదల, నేర్పుగలవాడు.

'ఆంధ్రకేసరి' సంఘస్థాపకులలో నొకడై అయిదారుసంవత్సరములు లిఖిత మాసపత్రికను నిర్వహించుటలో బాధ్యత వహించిన ఈయన, ఆప్రారంభోత్సాహమును సడలనీయక 'ఆంధ్రకేసరి గ్రంథమాల'ను 'ఆంధ్రకేసరి మాసపత్రిక'నుగూడ నెలకొల్పి వీటిద్వారా కొంతకాలము ప్రశంసనీయమగు సాహిత్య సేవగావించినాడు. మొదటి నుండియు 'సాధనసమితి'సభ్యుడై ప్రస్తుతము దానికి ఆయువు పట్టుగానున్నాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు స్థాపకులలో ముఖ్యుడు. చక్కని కథలను పద్యములను వ్రాయగలడు. సుకుమారభావ పుష్పములను ఏరుకొని కమనీయ సుందరహారముగా గూర్చుటలో ఈయనకు ప్రత్యేక విజ్ఞానము గలదు.

ఆంధ్రులలోని అనైక్యతను మానసిక శారీరక దౌర్బల్యములను నశింపజేసి, ఆంధ్రప్రతిభను పునఃస్థాపన జేయుటకుపకరించు ఏ కార్యము నందైనను 'ఉడుత భక్తి' కృషి యైనను చేయగలిగినచో, తనజీవితము ధన్యమగునని ఈయనతలపోయును.

ఆవేదన, లేక ఆనందము ఒకవిధమైన ఉద్రేకమును కలిగించి నప్పుడు సహజముగా ముంచుకొనివచ్చు భావములను, సద్యఃపరనిర్వృతికలిగించి, శ్రుతిపేయమైన భాషలో శిల్పివలె చిత్రింపగలిగిననే కావ్యరచనకు పూనుకోవలెనని ఈయన దృఢవిశ్వాసము. కవిత్వమునకు ఆనందముకన్న ప్రచారము ముఖ్యమని ఈయన అనుకోడు. ప్రయోజనము, లేక ప్రచారము విషయముపై ఆధారపడి యుండునుగాని, నసాస్మికముకాని ఏదియు కావ్యమనిపించుకోదని ఈయన నిశ్చితాభిప్రాయము.

రచనలు:

[ముద్రితము] వాహ్యాళి (కథానికలు)

[అముద్రితము] వ్యాసాలు; పద్యాలు.

# బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి

జననం : 1918

"కవితారచనకు ఎల్లా బలవంతం పనికిరాదని శాస్త్రమూ, అనుభవమూ స్థిరపరచాయో, అల్లాగే రచనను ప్రజలనెత్తిన బలవంతాన రుద్దరా"దనిన్నీ "కవిత్వంలేక సాహిత్యం వసంత హాసంతీ సుందరివలె ఆరాధనీయ" అనీ ఈయన గాఢవిశ్వాసం. "కళ అనేది జీవితంలో-అనగా జీవితానికి సంబంధించిన అన్ని కార్యాలల్లోనూ-ప్రాముఖ్యం కలిగిఉండాలి; అది అక్షరరూపం ధరిస్తే అమృతరమణీయమౌతుంది. ఇది గమనిస్తే, కవితాదేవి స్నిగ్ధపాదమంజీరాలు బ్రతుకులో మ్రోగాలి" అన్నదే ఈ కవి కుమారుని ఆశయం.

భాష ఈయన చెప్పుచేతుల్లో ఉంటుందేమోఅనిపిస్తుంది. భావాలు హిమగిరి శిఖరాగ్రాలు దాటి అనంతాకాశంలోకి ఎట్లా దూసుకపోతాయో అట్లాగే పతితల హృదయాలను చీల్చుకుని మనోనేత్రాలకు హత్తుకుంటాయి. సాహిత్యంలోని యేవిభాగంలోనైనా జీవకళలుట్టిపడేట్లు, ఒక ప్రత్యేకమైన కళావైదగ్ధ్యం అడుగడుగునా మిరిమిట్లు గొలిపేట్లు రచించే ఒడుపుతనకైవసం చేసుకున్నాడీయన. 'ఛందో బంధో బస్తులను ఛట్ పట్' త్రెంపివేసినా లేక సలక్షణ గ్రాంధిక భాషలో వృత్తాలు నడిపించినా ఈయన ప్రత్యేక ప్రతిభ యెప్పుడూ మరుగుపడదు. ఈయన కావ్యాలు నిజంగా బెల్లపు కొండలే!

స్వగ్రామమగు వేంసూరులో ఒక గ్రంథాలయమును హరిజనపాఠశాలనూ స్థాపించి నిర్వహిస్తున్నాడు. సంస్కృత ఆంధ్ర హిందీ విద్యాపీఠ స్థాపకులలో భాగస్వామియై విద్యావ్యాప్తికి కృషిచేస్తున్నాడు. 'ఆంధ్ర వాఙ్మయ సేవా సమితి' ద్వారా తెనుగుభాషకు ఎన్నదగిన సేవచేసినాడు.

రచనలు:

1 జ్వాలాతోరణం (ఖండకావ్యం) 2. ప్రేమనగరి (కావ్యఖండిక) 3. తరంగాలు (కథాకావ్యాలు) 4. వనప్రియ (గేయాలు) 5. ఉషశ్రీ (నాటికలు) 6. కథాకళి (కథలు) 7. రత్నావళి 8. నక్షత్రదాత 9. జహాంగీరు పసందు 10. పరమేశ్వరి (శతకం) 11. జ్ఞానభిక్షు 12. సిరియాలదేవి 13. ఏదిదారి? 14 సారస్వతేష్టి 15. అపాల. 16. ప్రతిశ్రుతి 17. దేశాభిమానం. 18. వ్యాసపీఠం. (వ్యాసాలు)

✵

# భాగి నారాయణమూర్తి

జననం : 1912

ఎడతెగని జిజ్ఞాస, నిరంతర సాధనతో తనసహజ కవితాశక్తికి పదును పెక్కిస్తున్నాడు ఈయువకవి. తనఆత్మను తాను వెతుక్కుంటూఉన్నట్లు కనబడుతాడు. హృదయంలో నుంచిరానిది చేతితో యేదీవ్రాయడు. ప్రయోజనము, ఆనందము-రెండూ భాగంపంచుకున్నాయిఈయన కవిత్వాన్ని. మహోన్నతమైనభావము, రమణీయమైన శైలిలోఅంతర్గతమైన ధ్వనీ యితని రచనల్లోని ప్రత్యేకత. ఇతడుకూడా విద్యార్థి దశనుండే కవిత్వరచనకు పూనుకొని

ఏకధారగా గీతాలు వ్రాస్తున్నాడు. విశిష్టత చెడకుండా, రచనా వేగం కుంటుపడకుండా వ్రాసే అభ్యుదయ కవుల్లో స్థానం సంపాదించుకొన్నాడు. ఆంధ్రావనిలోని ఉత్తమకవులను గణన చేసేటప్పుడు ఈయనకు తప్పకుండా ప్రత్యేకస్థానం దొరికి తీరుతుంది.

విశాలమైన జీవితాన్ని చిత్రవిచిత్రమైన లోకాన్ని వివిధకోణాలనుంచి దర్శించి అర్థం చేసుకొనేందుకు శ్రమించుటే యితని జీవితాశయం. నాటకాల్లో వేషాలు వేయాలంటే ఉబలాటపడతాడు. సంగీతప్రియుడు కూడాను. ప్రయోజనకారియై కృత్రిమం కాని లయప్రధానమైన-ఛందస్సు అక్కడక్కడ సడలించినా సరసగానక- రచనే ఉత్తమకవిత్వం అని యితని సిద్ధాంతం.

రచనలు:

[ముద్రితము] పరీక్షచదువు (నాటికలు)

[అముద్రితము] 1. జయగంట 2. రుధిరరేఖలు 3. పద్మంకథలు.
4. ఖండకావ్యాలు

## మూటుప్పురి వెంకటేశ్వరరావు

జననం : 1919

చిన్నప్పటినుంచీ నాటకాల్లో వేషాలు వేయడం, సంగీత సభలకు హాజరుకావడం, గేయాలో కథలో వ్రాసికొని సారస్వత సభల్లో పాల్గొనడం అలవాటు చేసుకున్న కళారాధకుడీయన. ఈ సహజప్రవృత్తే రాను రాను యితనినొక కవిగాను, గాయకుడిగానూ చేసింది.

'కవిత్వంలో కాని, కథారచనలో కాని, ఉద్గ్రంథ రచనలో కానీ-అమ్మమ్మలలాగు మడికట్టుకొని దూరంగా వుండడంకాక అందరికీ ఆప్యాయంగా అందుబాటులో వున్న రచనలకే విలువ; ప్రపంచానికి ఫలము,- అనే విశ్వాసం ఈయనలో బాగా నాటుకుంది. 'ప్రజాభిరుచినే, ప్రతిభావంతంగా రచనల్లో ప్రతిబింబింపజేసి విశ్వవిపంచికా నినాదంతో దానిని సమన్వయంచేసి. అంతరాత్మ శ్రుతులతో మేళవించుకొని, యితరులకు ఆనందం పంచిపెట్టి తనూ ఆ ఆనందాన్ని అనుభవించ గలిగిననాడే నిజమైన కవి, అనీ, తన కవిత్వానికి కూడా యిదే ఆదర్శం అనీ ఈయన అంటున్నాడు... విశ్వంఅంతా ఆవరించాలనీ, పసిపాపల బోసినవ్వులకు భాష్యం చెప్పాలనీ, అంతుపట్టని ముద్దరాలి మధురస్వప్నాలను పోతబోసి నిలబెట్టాలనీ... ఉబలాటపడతాడు. ఈయన ఆశయాలకు అంతులేదు.

ర చ న లు :

[అముద్రితము] వివిధ గేయాలు..

# వానమామలై వరదాచార్యులు

జననం : 1912

రచనలో పూర్వ సాంప్రదాయాలను ఒకవైపు, భావనలో ఆధునిక పద్ధతులను వేరొకవైపు చంకపాపలవలె యెత్తుకొని కావ్యరచనను సాగి

స్తున్న సాత్వికపథగామి ఈయన. విషయ సంగ్రహణంలోనేమి శైలీమాధు ర్యంలోనేమి ఈయన తెలంగాణాలోని ప్రతిభావంతులైన అభ్యుదయ కవులలో ఒక విశిష్టస్థానాన్ని ఆక్రమించుకున్నాడు. మనిషి వేషంచూస్తే యెంత ఛాందసుడివలె కనబడతాడో, సంభాషణలో నడవడిలో అంత సహానద్ధృష్టి, సామరస్యమూ, సంస్కారమూ తొణికిసలాడుతుంది. ఈయన కంఠమాధుర్యానికి కోకిలలే మోము దాచుకొంటాయట!

హరికథా కథనమందు పురాణ పఠనమందు ప్రావీణ్యము గడించు కొని జనసామాన్యాన్ని, కవితాపాటవంచేత రసజ్ఞులనూ మెప్పిస్తూ, సర్వ జన సమాదరణీయుడైన ఈయన వ్యక్తిత్వాన్ని తెలుగునాటగల పండిత ప్రకాండులు కళాకోవిదులు యెంతో ఉగ్గడించినారు. ఇంతటి ప్రతిభగల ఈ వినయభూషణుడు మామూలు సన్మానాలు అందుకోడానికి కూడ మొహమోట పడతాడు.

దేశనాయకులను, రాజకీయ ధురంధరులను తనకవిత్వంలో ర్తించి వారి యశశ్చంద్రికలను ఆయువు పోయటంచూస్తే, దేశభక్తిలో జాత్యభి మానంలో ఈయన యెవరికీ తీసిపోడని తోస్తుంది.

ఈయన కవితావనికి యెల్లలులేవు. శ్రీరాముడు, పోతన, మహా త్ముడు, రవీంద్రకవి చందురుడు మొదలగు వారినిగురించి యెంతఘనంగా వ్రాస్తాడో - ఊరపిచ్చుక, తృణము, పెంటపోగు పాదరక్షలను గురించి కూడా అంతే గంభీరంగా వ్రాస్తాడు. ఈయన అభిమానరసము కరుణము. దేశీయములైన శబ్దాలను సందర్భానుసారంగా వాడుతూ, రమ్యము కడు సున్నితమూ అయిన శబ్దార్థశ్లేషను కూర్చుటలో ఇతనికి ఇతడేసాటి. ఈయన గేయాల్లో కూడ ఈ ప్రత్యేకప్రతిభ కనపడుతుంది.

'మానవజీవిత కర్తవ్యముగు అహింసాపురస్సర లోకకల్యాణం, నైతిక ధర్మాదేశం, కళారాధనయే' ఈయన తన కవిత్వానికి జీవితానికి పరమాశ యంగా పెట్టుకున్నాడు.

రచనలు :

[ముద్రితము] మణిమాల (ఖండకావ్యం)

[అముద్రితము] దాగుడుమూతలు 2. వైశాలిని (నాటకము) 3. మౌక్తిక మాల 4. వ్యాసావళి 5. బాపూజీ నిర్యాణగేయావళి 6. పోతన (కావ్యము).

# పుర్పుటూరు రాఘవాచార్యులు

జననం : 1922

చరిత్ర పుటలలో మిగిలిపోయిన ఆంధ్రుల ప్రతాపము హృదయంలో మెరసినా, జీర్ణశిథిలాల్లో నిలిచిపోయిన తెలుగువారి కళావైభవసంపత్తి మనోనేత్రాలలో తళుకొత్తినా, లేక ఆర్యసంస్కృతి యొక్క ప్రాచీన ప్రాశస్త్యాన్ని పునరుద్ధరించాలన్న ఆవేశం కలిగినా, నిర్మల స్రవంతివలె భావాలు ఉబికివచ్చి ఈయన సహజ కవితాశక్తిని బయటికి లాక్కొస్తాయి. సమకాలీనమైన జాతీయ జీవనంలోని శుభాశుభ సంఘటనలు కూడా ఈయనతో ఉత్తమ రచనలను చేయిస్తాయి. ఇంగ్లీషులోని ఉత్తమ కావ్యాలను తెనుగులోకి అనువదించడమంటే యెక్కువ అభిరుచి ఈయనకు.

భారతీయ నాగరకతలోని ప్రాచీనతకు నవ్యత గూర్చేటే తన కవిత్వానికి ఆశయంగా పెట్టుకున్న సార్వతోపాసకుడు. వయోజన విద్యావ్యాప్తి ఈయన అభిమాన వ్యాసంగము.

రచనలు :

[అముద్రితము] ఖండకావ్యాలు.

# వెల్దుర్తి
## మాణిక్యరావు

జననం : 1918

'ఏడ్చువారల నెవడు ఓదార్చలేడు; నవ్వువారల నెవడు నొప్పించలేడ'నీ, 'జీవితానికి ఆనందంతప్ప మరో ఆశయంలేద'నీ సాక్ష్యం చెప్పగల ధైర్యశాలి ఈయన. అందరూ, ఆనందం పొందగలిగే వ్యక్తిస్వాతంత్ర్యం కలిగి వుండాలని ఈయన ఆకాంక్ష. కాబట్టి నిత్యసంతోషి, నిత్యయవ్వనుడు వలె కనబడుతూ సరస సంభాషణప్రియుడై, దైనందన జీవితంలో ఎన్ని ఒడుదొడుకులువచ్చినా సుఖంగా వాటిని దాటగలుగుతున్నాడు. ఈయన కవిత్వంకూడా యిదేధోరణిలో నడుస్తుంది. ఆనందంతప్ప అన్యమెరుగని బాలబాలికలే ఈయన ముఖ్యస్నేహితులవటంచేత బాలవాఙ్మయమును సృజించుటలో విశేషమైనశ్రద్ధను, ప్రత్యేకమైన సామర్థ్యాన్ని చూపెడుతున్నాడు. ఈయన కవిత్వానికికూడా ఆనందమే పరమావధి అంటున్నాడు గాబట్టి సృష్టిలోని సుందర వస్తుజాలంలో యేదైనా, సుఖాన్ని అనుభవించగల జనప్రపంచంలోని యేప్రాణియైనా ఈయన కావ్యవస్తువై పోతుంది.

కావ్యసుమారామంలో ఈయన గేయాలు ఒక విశిష్టమైన రూపలావణ్యాలను, ప్రాంతీయమైన అభిజాత్యాన్నీ ప్రదర్శిస్తుంటాయి. స్వాభావసిద్ధమైన శిల్పసంపత్తిగల కళాఖండాలవలె ఈయన రచనలు అతి నాజూకుగా ముట్టుకుంటే మాసిపోయేటట్లు వుంటాయి.

సామాజిక రాజకీయ సంఘటనలు ఈయన హృదయాన్ని స్పందింప చేసినప్పుడు, తన ఆనందోపాసనను తాత్కాలికంగా కట్టిపెట్టి, ఉత్తేజకరమైన రచనలనుకూడా చేస్తాడు.

గ్రామీణులకు వారి భాషలోనే సులభంగా గ్రాహ్యమౌనట్లు, ఉపయోగము ఆనందమూ కలిగింపజాలే నాటికలనూ కథలను వ్రాయుటలో ఈయనది అందెవేసిన చేయి.

రచనావ్యాసంగమే ముఖ్యముగాగల ఈయన, కళాప్రపంచములోని నవ్యనూతనమైన పద్ధతులను అన్వేషించు రసపిపాసి యైనందున, పరిణతో సృష్టికి వలయు పరిశ్రమనుకూడ అలవరుచుకొన్నాడు. మహారాష్ట్రి కన్నడ ఉర్దూభాషల పరిచయముకలిగి ప్రత్యేకంగా ఉర్దూలో చక్కని వ్యాసాలు వ్రాయటం ఉపన్యసించుట నేర్చుకున్నాడు.

నిజీవ కాలము విద్యార్థి దశ సంఘములలో పనిచేసి తదుద్యోగము మాసపత్రిక నిర్వహణాధికారము వహించుటేగాక 'గ్రామసుధార్', 'తెలుగు సృష్టి' మొదలగు పత్రికల సంపాదకవర్గములో ఉండి, ఆంధ్రమహాసభ-ఆంధ్ర యువజన సంఘము మొదలగు అనేక సంస్థలలో కార్యకర్తయై కరిమశిక్షణ అనుభవము సంపాదించుకొన్నందున, ఈయనకు, ప్రచారానికి వలయు

వాక్పటిమ, పత్రికారచనకు తలయు రచనాభ్యాసమూ చక్కగా అలవడినాయి. 'అణాగ్రంథమాల', స్థాపకులలోనొకడై కొంతకాలము, జనసామాన్యంయొక్క విజ్ఞాన వికాసాలను పెంపొందజేసే లఘుపుస్తకములను ప్రకటించి, ప్రశంసనీయమైన సేవ చేసినాడు. ఆంధ్ర సారస్వతపరిషత్తు 'సాధన సమితి' కార్యనిర్వాహకులలో నొకడై యీ సంస్థలకు ఎంతేనిబలము చేకూరుస్తున్నాడు.

ఒకమాటలో చెప్పాలెనంటే ఈయనతో సంబంధములేని ఏ సారస్వత సంస్థకూడా హైదరాబాదులో లేదని అనాలి.

రచనలు :

[ముద్రితము] 1. దయ్యాల పన్నడ (గ్రామ్యభాషలో నాటిక) 2. రైతు 3. దయానందుని జీవితము 4. రాజ్యాంగ సంస్కరణలు 5. ఖాదీ.

[అముద్రితము] 1. బాలగేయాలు 2. మానీసా (కావ్య ఖండిక) 3. శ్రవ్యనాటికలు 4. కథానికలు.

# సన్నిధానం
# శ్రీధరశర్మ

జననం : 1920

'కళలో, కవిత్వంలో—జీవితంలో పరిపూర్ణతను సాధించాల'ని ఈయన మహదాశయం. 'మానవుడు చేసే ప్రతివిషయమూ కళాసమన్వితంగా సమగ్రంగా వుండాల'ని ఈయన ఆకాంక్ష.

ఐహికంకన్న ఆముష్మికానికే అఱ్ఱులు చాస్తున్నా, ఈయన లేఖిని సాహిత్యంలోని వివిధ రచనారంగాల్లోనూ నటిస్తుంది. 'వ్యాకరణానికి కళ్ళెం' తగిలించి అప్పుడప్పుడు గేయరచనలు చేసినా, సలక్షణమైనభాషయే సాంప్రదాయసిద్ధమైన రచనాపద్ధతులే ఈయనను ఎక్కువగా ఆకర్షించినాయి. సంగీతంలో ఈయనకుగల ప్రవేశం, చక్కని ధారాశుద్ధిగల పద్యాలను వ్రాయుటలో ఉపకరిస్తుంది.

కవిత్వం, ఈనాటి కొన్ని ప్రత్యేక పక్షాలయొక్క ప్రచారంకోసం కాక కేవలం ఆనందమూ విశ్వశ్రేయంకోసమూ ఉపయోగపడాలంటాడు ఈయన.

తీరికసమయాన్ని తత్త్వశాస్త్ర పరిశీలన, కావ్య పఠన కోసమూ వినియోగిస్తూ, ఇటు భాషాసేవకూ అటు జ్ఞాన సముపార్జనకూ పాటుపడుతుంటాడు.

ర చ న లు:

[ముద్రితము] 1. అభిషేకము.

[అముద్రితము] 1. జాజిమొగ్గలు 2. ప్రాణభిక్ష (ఖండకావ్యాలు)
3. చిత్రాంగద 4. మేలుకొలుపు (నాటకాలు)
5. అభిసారిక 6. శృంగభంగము (ఏకాంకికలు)
7. సత్యాగ్రహి 8. అక్కచెల్లెళ్లు (నవలలు) 9. చతుష్టయి (రవీంద్రుని కథలకు అనువాదాలు).

# సిరిప్రగడ భార్గవరావు

జననం: 1923

ఈ కవికుమారుని నరనరంలో కవిత్వం ప్రవహిస్తుందేమో అని అనుమానం కలుగుతుంది. గురువుగారగు శ్రీ అంబటిపూడివారి 'మనస్స్వర భావ్యాలు పీల్చుచు, వారికృపాలోక కుటీరంలో వర్ధిష్ణువుడై...వారిగళధ్వనిలోని కమనీయత ననుకరించుచు, విసుగు లేకుండా పాఠాలు చదువుకునేవాడు... కావ్యచర్చలు కవితాగోష్ఠులు సలుపుతూఉంటే యేవో భావాలు ఘనాఘనంలోని తటిన్నాట్యాలవలె కదలి ఈయనలో లీనమయ్యేవట! ఆ భావోద్వేగంతో ఊహావ్యోమాలలో తేలిపోయి, నైరాశ్యంతో ఏ అధః కుహరాలలోనో వ్రాలేదట!! ఈ యువకునికి జగత్తంతా బాధావిలం

శిథిలమైన తన జీవితానికి తాను పాడుకునే విషాదగీతాలే పాథేయం అంటాడు. సమాజంలోని గడ్డుసమస్యలు ఈయననంతగా ఎదుర్కొన్నవు. తన బాధేమో తానేమో అన్నట్టుగా యితర ప్రపంచంతో సంబంధం పెట్టుకోక 'ఈ నిట్టూర్పులతో ఘనాఘనగణాంగీభూత మార్గంబులందే సెంజాక జరింతు? ఈ వ్యథల కంతేలేద?' అన్న ప్రశ్నకు జవాబు వెతుక్కుంటూ ఉంటాడు. 'చేతస్సులోలోనన్ క్రుసంగి కవోష్ణబాష్పమయ కల్లోలాల తో కెళ్ళకేమానో తోచదుగా!' అని తనకుతానే దిగ్భ్రమ జెందుతాడు...

ఈయనహృదయంలో వేదన యింతగా ఘనీభవించినందువనే ఈయన కవితా లతాంతము అంత మాధుర్యాన్ని నింపుకుంది. ఈ మకరందాస్వాదనకై, పదలాలిత్యము, శయ్యావిలాసము, రచనాశిల్పము, ధారాశుద్ధి మొదలగు గుణాలు తమంతకుతామే—మధుకరులవలె—అనుసరించి వస్తాయి.

'సాహితీమేఖల' హేమవలయంలో భాసించేచంద్రజ్యోతి ఈయన!

రచనలు:

[అముద్రితము] ఖండకావ్యాలు.

## సిరిప్రగడ రాధాకృష్ణరావు

జననం: 1916

ధనియాలపువ్వు, వరిమొక్కకూడా ఈయనను కవిత్వం వ్రాయడానికి ప్రేరేపిస్తాయి. తేనెలుచిలికే కమ్మని గీతాలనుపాడుకుంటూ తెనుగు తోటకుమాలియై సారస్వతవిద్యార్థిగా జీవితం గడపాలని ఈ మధురకవి

ఆశయం. ఈయనకూడా చందూరు ప్రాంతములో విలసిల్లిన 'సాహితీ మేఖల' సభ్యులలో ఒకడు. తనహృదయంలో 'కవితావాహిని జాలువారటం విరమించింద' ని విలపించినా, ఈయనఉత్తమతరగతికి చెందిన లలిత కావ్య రచనాపటిమను తన లేఖినీముఖంలో దాచుకున్నాడని చెప్ప వచ్చును.

రచనలు:

[అముద్రితము] ఖండకావ్యాలు.

## సురవరము ప్రతాపరెడ్డి

జననం: 1896

ఆంధ్రదేశ విద్వన్మణులలోని ఒక దివ్యమణి ఈయన. బహుభాషా కోవిదుడగు ఉద్దండ పండితుడు; ఉత్తమపరిశోధకుడు. విద్వద్గోష్ఠులలో సతికత్తులను పట్టీలను గొట్టించ గలిగిన ప్రతివాది భయంకరుడు!

ఈయనకు చరిత్రఅభిమాన విషయము—సాహిత్యమునకు జీవితము అంకితము చేసినాడు—ఎనమిదేండ్ల న్యాయవాద వృత్తిని వదలిపెట్టి పత్రికా రచనద్వారా దేశసేవ, భాషాసేవ చేయుటకు కంకణబద్ధులై 'గోలకొండ' ద్వైవారపత్రికను. ఇరువదియైదు సంవత్సరాలు ఏకైక దక్షతతో

నడపినాడు. తెలంగాణము నందలి రాజకీయ సాంస్కృతిక ఉద్యమాల అన్నింటితోను ఈయనకు సంబంధముకలదు. ఆంధ్ర మహాసభకు మొట్టమొదటి అధ్యక్షుడు ఇతడే. తెలంగాణమున జరిగిన దాదాపు ప్రతిసంస్థ ప్రథమ సమావేశమునకు ఈయనే అధ్యక్షుడు. కొన్నియేండ్లు ఆంధ్ర మహాసభకును, ఏడెనమిది సంవత్సరములు రెడ్డివిద్యార్థి వసతిగృహమునకును కార్యదర్శిగా నుండి పనిచేసినాడు.

కవిత్వము, కథారచన, వ్యాసరచన, సాహిత్యవిమర్శన, చరిత్రపరిశోధన, విజ్ఞానము మొదలైన వివిధవాఙ్మయ వీథులలో ఈయన కలము స్వైరవిహారము జేసినది. తెలుగు సీమలోని ప్రథమశ్రేణికి చెందిన కథకులలో ఈయనకు స్థానముకలదు. ఆంధ్రదేశ పండితులలో, పరిశోధకులలో ఇతడొక ఉన్నత స్థానమునుఆక్రమించుకొన్నాడు. భాషాశాస్త్ర పరిశీలనము గావించి ఆంధ్రభాషకు వలయు సాంకేతిక పదజాలమును సమకూర్చుచున్నాడు. అలభ్యములైన అనేక గ్రంథములను, చాటువులను, జానపద గేయములను సేకరించి ఆంధ్ర భాషాగారమును పునరుద్ధరింప ప్రయత్నించుచున్నాడు. నిరంతర పరిశోధనలో, విజ్ఞానార్జనలో ఈయన చూపుచున్న శ్రద్ధఅనితర సాధ్యము. అయినప్పటికిని తనది 'గంధర్వగోళ జీవితము'ని 'పొట్టి వెంగళప్పగా' పత్రికలలో ఉంటున్నానని ఈయన అనుటవల్ల ఈయన జ్ఞానతృష ఎంత అపారమైనదో, ఆశయాలు ఎంత ఉన్నతములో తెలియుచున్నవి.

ఈయన కలము ఎంతవాడియైనదో హృదయముఅంత నిర్మలమైనది. ముఖస్తుతులకు లోనుగాక స్వపక్ష పరపక్షములను భేదముపాటింపక యదార్థమును వచించు నిష్పక్షపాత విమర్శకులలో ఈయన పేరుచెప్పి మరొక

ని చెప్పవలెను. ఈయన స్వభావముచే మితభాషి. పాడిమాటలుకట్టివిరుపుగా ధ్వనించినను, సంభాషణలోకి దిగినతర్వాతగాని ఉపన్యసించుచున్నప్పుడుగాని అనేక క్రొత్తవిషయములను చెప్పుచు, పాతవిషయములపై క్రొత్త కాంతులను ప్రసరించుచు, మధ్య మధ్య సందర్భోచితమైన హాస్యకథలను ప్రవేశపెట్టుచు అనేక చిత్రంగా శ్రోతలను వశంవదుల గావించుకొనును.

చనలు :

[ముద్రితము] మొత్తము పదునెన్మిది. అందులో ముఖ్యమైనవి. —
1. ఆంధ్రుల సాంఘిక చరిత్ర 2. రామాయణ విశేషములు 3. హిందువుల పండుగలు 4. ఉచ్ఛల విషాదము (నాటకము) 5. హైందవ ధర్మవీరులు 6, ప్రతాపరెడ్డి కథలు 7. ప్రాథమిక స్వత్వములు 8. గ్రంథాలయములు 9. వెంకట రామారెడ్డి జీవితచరిత్ర.

[అముద్రితము] 1. తుకారాం (నాటకము) 2. యువజన విజ్ఞానం 3. ఖండ కావ్యములు 4. శుద్ధాంత కాంత (నవల) 5. సుమారు మూడువందల వ్యాసములు.

# సోమరాజు
# ఇందుమతీదేవి

జననం : 1915

ఈమె, భక్తిగీతాలు ప్రార్థనా పద్యాలు వ్రాయుటలో నేర్పరి. అయితే తఱచుగా పత్రికల్లో తన రచనలు ప్రకటించి ముందుకు తోసుకవచ్చే స్వభావం కాదు. నిర్దుష్టమైన గ్రాంథిక భాష వాడినా, భావపుష్టి గలిగి సాఫీగా నడచిపోతాయి ఈమె పద్యాలు. ఎంతటి భక్తురాలో అంతటి రసపిపాసి.

ప్రియునికి ప్రియురాలిని గురించి కలిగే భావాలను కావ్యాల్లో వ్యక్తీకరించుట మనకవులకూ, కవయిత్రులకూ పరిపాటి అయిపోయింది. కాని ప్రేయసికి ప్రియునిగూర్చి కలిగే భావాలను మాత్రం ఆధునికుల్లో సామాన్యంగా కవయిత్రులు చిత్రించలేదు. ఈమె ఆ కొఱతను తీర్చింది... భర్త చెంత లేనప్పుడు ఆ వెలితి స్ఫురింపజేసే వివిధ భావాలను సుందరముగా చక్కని సాంసారిక కథలవలె, తన కవిత్వంలో పేరికూర్చింది ఈమె.

ఆశలుగొలిపి కవిత్వం పరిపూర్ణత నందకముందే ఈమె చిరకాలానికి శాశ్వతశాంతినొందుట భాషాభిమానులకు ఆశాభంగము కలిగించింది.

రచనలు :

[ముద్రితము] 1. పతిభక్తి 2. శ్రీరంగ దేవస్తోత్రము.

[అముద్రితము] 1. శకుంతలాపరిణయము. 2. వేణుగోపాలస్వామి శతకము.

# అకారాది శీర్షికలు


| | | | |
|---|---|---|---|
| అంజలి | ... | ... | ౪౫ |
| అడుగుజాడలు | ... | ... | ౫౨ |
| అన్వేషణ | ... | ... | ౨౩ |
| అమృతప్రభాతము | ... | ... | ౧౦౪ |
| ఆంధ్ర భారతి | ... | ... | ౬౨ |
| ఆత్మహుతం! | ... | ... | ౭౧ |
| ఆయాది | ... | ... | ౮౧ |
| ఆరాధన | ... | ... | ౭ |
| ఋతుత్రయము | ... | ... | ౨౭ |
| ఎందులకో ? | ... | ... | ౬౩ |
| ఓరుగల్లుకోట | ... | ... | ౭౩ |
| కవితాటోపం | ... | ... | ౬ |
| గౌరి | ... | ... | ౫౫ |
| చందమామ | ... | ... | ౫౮ |
| జీవితము | ... | ... | ౧౬ |
| తెనుగుతల్లి | ... | ... | ౫౯ |
| తెనుగుతోట | ... | ... | ౬౦ |
| తెనుగువెలుగు | ... | ... | ౧౧ |
| తెలంగాణా విముక్తి | ... | ... | ౧ |

| | | | |
|---|---|---|---|
| దీపావళి | ... | ... | ౯౭ |
| దుక్కి–బక్కి | ... | ... | ౯౫ |
| నీరాక | ... | ... | ౬౪ |
| నేను | ... | ... | ౪౪ |
| ప్రపంచం | ... | ... | ౯౦ |
| ప్రబోధము | ... | ... | ౭౨ |
| ప్రాగ్భూమి | ... | ... | ౫ |
| పాదరక్షు | ... | ... | ౯౨ |
| ఫాల్గుణ అమావాస్య | ... | ... | ౩౩ |
| పిల్లలమండే, పిల్లలమూ | ... | ... | ౨౫ |
| పువ్వా ! | ... | ... | ౫౩ |
| పూలచెట్లు | ... | ... | ౪౯ |
| బిచ్చగాడు | ... | ... | ౧౦౦ |
| భానురథము | ... | ... | ౨౭ |
| భిమక్కి | ... | ... | ౧౦ |
| మధురపథము | ... | ... | ౬౮ |
| మధురోహ | ... | ... | ౧౯ |
| మహాత్మ్యాంత్కు | ... | ... | ౧౮ |
| మా ప్రణయం! | ... | ... | ౨౬ |
| మాను | ... | ... | ౮౭ |
| మాయ | ... | ... | ౨౦ |
| మి తుడా! | ... | ... | ౫౭ |

| | | | |
|---|---|---|---|
| ముల్లు | ... | ... | ౪౮ |
| వేయిస్తంభాలగుడి | ... | ... | ౪౯ |
| శారద | ... | ... | ౫౧ |
| సంక్రాంతి | ... | ... | ౫౧ |
| సంక్రాంతి | ... | ... | ౭౧ |
| సఖ్యం | ... | ... | ౩౧ |
| స్వప్నసుందరి | ... | ... | ౬౫ |
| సారస్య పటిమ | ... | ... | ౯౮ |
| స్వాహా | ... | ... | ౧౩ |
| సెలయేరు | ... | ... | ౩౯ |
| సృష్టి | ... | ... | ౪౮ |
| హితోక్తి | ... | ... | ౫౬ |
| హృదయావేదన | ... | ... | ౭౨ |
| క్షమామూర్తి! | ... | ... | ౧౦౧ |
| ? | ... | ... | |

# ఇందులో తప్పులూ — ఒప్పులూ.

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
| --- | --- | --- | --- |
| ౨౬ | ౧౩ | డాగినాసో | డాగినావో |
| ౨౭ | ౯ | తీరుగు | తిరుగు |
| ౨౮ | ౧౪ | తత్రించు | తంత్రించు |
| ౨౯ | ౧౧ | పృథముని | పృథముని |
| ౩౩ | (శీర్షిక) | ఫాల్గుణబహుళ అమావాస్య | ఫాల్గుణఅమావాస్య |
| ౩౩ | ౧౬ | కనుగోసలు | కనుగోనలు |
| ౩౪ | ౯ | అర్థము | అర్థము |
| ౩౪ | ౧౫ | వియచ్చర | వియత్ |
| ౩౫ | ౧ | స్వార్థునీ | స్వార్థునీ |
| ౪౦ | ౮ | గుండ | గుండు |
| ౪౯ | ౨ | ఉదయిమయ్యో; | ఉదయమయ్యో |
| ౫౦ | ౧౬ | భక్తితో | భక్తితో |
| ౫౧ | (పేరు) | హనుమంత | వేంకటహనుమంత |
| ౫౨ | ౧౫ | తేనే | తెనే |
| ౫౮ | ౬ | పయస్సు | పయస్సు |
| ౬౦ | ౯ | అందాలు | అందాలు |
| ౬౨ | ౧౩ | పెదజలు | పెదజల్లు |
| ౭౩ | ౧౪ | నప్తులరు | నలరు |
| ౭౪ | ౧ | తలపుల | తలపులు |

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
| --- | --- | --- | --- |
| ,, | ౫ | వాధుకడకు | వాడుకడను |
| ,, | ౭ | నిఖుపు | నిల్పుపు |
| ,, | ౯ | నగ్గు.. | నఘు |
| ౯౦ | ౪ | కొరగచే | కోరగచే |
| ౯౧ | ౯ | దేసమున్ని | దేశముని |
| ౯౪ | ౯ | శకి | శక్తి |
| ,, | ౧౬ | కర్మ్రుముల | కరమ్మ్రుల |
| ౯౬ | ౫ | వేసికాని | వేసికొని |
| ౯౭ | ౪ | కిఱ్ఱుంకి | కిఱ్ఱుకి |
| ౧౦౦ | ౧ | ష్టిగ్ట | పిట్టి |
| ,, | ౧౩ | మొలన్పైన | మొంలపైన |
| ౧౦౧ | ౧౫ | న[illegible]నాల | నయనాళ |
| ౧౦౩ | ౭ | చాయచికిత్స | ఛాయచికిత్స |

# 'ప్రత్యూష' ప్రచురణములు

౧. అంజలి (గేయాలు)—వివిధ రచయితలు.

౨. ప్రేమ్‌చంద్ అనువాదాలు (కథలు)...శ్రీ నెల్లూరి కేశవస్వామి

౩. పరీక్షచదువు (నాటిక)—శ్రీ భాగి నారాయణమూర్తి

౪. నిర్మాణము (వ్యాసములు)—శ్రీ 'సాధక'

౫. పాలవెల్లి (కథలు)—వివిధ రచయితలు వెల 0-12-0

* ౬. భోజరాజు (పద్యకావ్యము)—శ్రీ గాదిరాజు వేంకటరమణయ్య

౭. మధుకణములు (గేయాలు)—శ్రీ పిల్లలమఱ్ఱి వేంకట హనుమంతరావు

౮. సాంధ్యగీతి (నాటిక)—శ్రీయుతులు 'సూర్యచంద్రులు'

౯. వాహ్యాళి (కథలు)—శ్రీ బూర్గుల రంగనాథరావు.

౧౦. భగ్నహృదయుడు (నాటిక)—శ్రీ భండారు చంద్రమౌళీశ్వరరావు.

౧౧. ఆముక్తమాల్యద పర్యాలోకనము (వ్యాసములు)—శ్రీ నెల్లుట్ల ప్రభాకరరావు.

౧౨. సాహితీవిపణి (గద్యపద్యాత్మకము)—వివిధ రచయితలు వెల 1-0-0

౧౩. నిర్మాణగానము (గేయాలు)—శ్రీ శేషుబాబు.

౧౪. అశోక రాజ్యము (నాటిక)—శ్రీ శేషుబాబు.

* ౧౫. రంగవల్లి. (౧౯౪౬ పోటీకథలు)—వివిధ రచయితలు. వెల 0-4-0

* ౧౬. నవ్యకవితా నీరాజనము (వ్యాసాలు)—శ్రీ దేవులపల్లి రామానుజరావు. వెల 0-12-0

* ౧౭. మాయింట్లో (కథలు)—శ్రీ ధరణికోట శ్రీనివాసులు. వెల 0.12-0

* ౧౮. ప్రత్యూష (కావ్యసంకలనం)—వివిధ రచయితలు.

---

* ఇవితప్ప తక్కిన ప్రచురణాల ప్రతులులేవు.

ప్రతులకు :— సాధనసమితి కార్యాలయము.

195/B3, ఈసామియాబజారు,

హైదరాబాదు. ద.

# మా సమితి క్రొత్తపోషకులు

౧. శ్రీ పర్సా వెంకటేశ్వరరావుగారు.

౨. ,, ఇ. వి. రామరెడ్డిగారు.

౩. ,, రావులపాటి మధుసూదనరావుగారు.

౪. ,, ఎన్. దుర్గయ్యగారు.

౫. ,, రామప్పగారు.

౬. ,, నందగిరి వెంకటరావుగారు.

౭. ,, గాడేపల్లి సూర్యప్రకాశరావుగారు.

౮. ,, శంకర నారాయణగౌడుగారు.

౯. ,, ఎల్లం సత్యనారాయణగారు.

౧౦. ,, తుంగా రామదాసుగారు.

౧౧. ,, నాగులపల్లి కోదండరామరావుగారు.

౧౨. ,, డాక్టరు రంగాచార్యులుగారు.

౧౩. ,, రామయ్యజోషీగారు.

౧౪. ,, మందుముల రామచంద్రరావుగారు.

ప్రత్యూషప్రచురణము. ౧౭. ౧౯౩౦

# సాధన సమితి

ఈసామియాభజారు

హైదరాబాదు.

మొదటికూర్పు. ౧౦౦౦ ప్రతులు.

పద్మశాలి ప్రింటింగ్ ప్రెస్, రాజమొహల్లా, హైద్రాబాదు-ద.